# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 195 | శుక్రవారం 06 –12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in





# అధికార, ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం

- అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కుర్చీ ఖాళీగా ఉండడం మంచిది కాదు
- అసెంబ్లీకి వచ్చి మా పాలన విధానాల్లో లోపాలు వివరించండి
- అభివృద్ధి, సంక్షేమానికి మీ పిల్లలు అడ్డుపడుతున్నారు
- ఇష్టారీతిగా వ్యవహరిస్తే చట్టం తన పని తాను చేస్తుంది
- ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సాంకేతికతతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక
- పైలెట్ ప్రాజెక్టులుగా మహబూబ్‌నగర్, నిజామాబాద్, భద్రాద్రి, మెదక్ జిల్లాలు
- కేసీఆర్ రద్దు చేసిన గృహనిర్మాణ శాఖను పునరుద్ధరించాం
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అన్ని రాజకీయ పార్టీలకు ఆహ్వానం
- కేసీఆర్, కిషన్ రెడ్డి,బండి వచ్చి గౌరవం నిలుపుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ అప్లికేషన్ ప్రారంభంలో సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ఈనెల 9న ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశాలకు వచ్చి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి.. ప్రతిపక్ష నేత కేసీఆర్ ను కోరారు. ప్రభుత్వం అంటే 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదన్న ఆయన 119 మంది ఎమ్మెల్యేలు కలిస్తేనే ప్రభుత్వం అన్నారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి అంతే ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కుర్చీ ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిదా? అని ప్రశ్నించారు. మీ చతురత చూపించి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టండి అని కేసీఆర్ పై సెటైర్లు వేశారు. ప్రస్తుతం సభలో కేసీఆర్ కంటే ఒకరిద్దరే సీనియర్లు ఉన్నారన్న సీఎం తామంతా అప్ కమింగ్ ప్రతినిధులమన్నారు. గురువారం సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించిన సీఎం.. కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నా తమకు ఎలాంటి భేషజాలు లేవన్న ఆయన సభకు వచ్చి తాము పాటించే విధానాల్లో ఏవైనా లోపాలుంటే తెలియజేయాలని సూచించారు. అలాగే అభివృద్ధి.. సంక్షేమం విషయాల్లో సమతూకం చేసుకుంటూ ముందుకుపోతోన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల కేటీఆర్, హరీశ్ రావు తుల్వ పనులు చేస్తున్నారనీ సీఎం ఫైర్ అయ్యారు. తాము చేపడుతోన్న కార్యక్రమాలకు సుబాహుల్లా, రాహు కేతువుల్లా

మిగతా 2లో

# చేరికల టైం వచ్చింది

- త్వరలోనే కాంగ్రెస్ లో బీఆర్ఎస్ నేతలు
- చాలా మంది మాతో టచ్ లో ఉన్నారు
- ప్రజా ప్రభుత్వం పనితీరుకు ఆకర్శితులై చేరికలు
- కాంగ్రెస సర్కార్ పై ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకపోతూన్న ప్రతిపక్షం
- చట్టాన్ని ఎవరు చేతిలో తీసుకున్నా సహించబోం
- గాంధీభవన్ లో మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరికల సమయం దగ్గరపడిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన చాలా మంది నేతలు తమతో టచ్ లో ఉన్నారన్న ఆయన వారంతా అతి త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వ్యాఖ్యానించారు. గురువారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే వంద శాతం అభివృద్ధి చేశామన్న పార్టీ చీఫ్... రాష్ట్రంలో రేవంత్ మార్క్ పాలనకు బీజం పడుతోందని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి బీఆఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏకకాలంలో చేసిన రూ.2లక్షల పంట రుణమాఫీ దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే 50వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర దేశంలో ఒక్క తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తమ ప్రభుత్వంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు అంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు , కౌశిక్ రెడ్డి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించిన మహేశ్ కుమార్ గౌడ్.. నోటికి ఏది వస్తే అదే మాట్లాడతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని.. తప్పు చేసిన అందరూ శిక్షార్హులే అని.. అందరూ శిక్షింపబడుతారన్నారు

# కేసీఆర్‌ను తప్పుబడుతూనే ఉంటా

- విద్యావ్యవస్థను నాశనం చేసింది కేసీఆర్
- కాళేశ్వరం పేరుతో నిధుల దుర్వినియోగ చేసిండు
- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

మాజీ సీఎం కేసీఆర్ ను తాను పదే పదే తప్పుబడుతూనే ఉంటానని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి చెప్పారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కేసీఆర్ నాశనం చేశారని మండిపడ్డారు. గురువారం ఓ మీడియాకు ఇచ్చిన



మిగతా 2లో

# హస్తం గూటికి సోయం

- బీజేపీకి రాజీనామా చేసిన మాజీ ఎంపీ

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



రాష్ట్రంలో బీజేపీకి షాక్ తగిలింది. ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపు రావు గురువారం బీజేపీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ఆయనకు గాంధీభవన్ లో కాంగ్రెస్ కండువు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటుగా అత్రం సక్కు కూడా హస్తం గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సోయం బాపూరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్శితుడిని అయి కాంగ్రెస్ లో చేరినట్లు వెల్లడించారు. అన్నీ మతాలను గౌరవిస్తానన్న ఆయన కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తానని తెలిపారు.

# అదానీ, అంబానీలతో పోటీపడాలి

- మీలో ఉన్న శక్తి, నైపుణ్యాలను ప్రపంచానికి చాటాలి
- మహిళలకు సీఎం రేవంత్ పిలుపు
- గవర్నర్ తో కలిసి ఇందిరా మహిళా శక్తి బజార్ ప్రారంభం
- మహిళలతో ముచ్చటించిన గవర్నర్

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



సోలార్ పవర్ ప్రాజెక్టుల్లో తెలంగాణ అడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీ పడేలా ప్రజా ప్రభుత్వం పూర్తి ప్రణాళిక, నిర్దిష్ట కార్యక్రమంతో ముందుకు వెళ్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇది సాధ్యపడాలంటే స్వయం సహాయక సభ్యుల సంఖ్య 65లక్షల నుంచి కోటి మందికి చేరాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం మాదాపూర్ శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేసే బాధ్యత తమ ప్రభుత్వానిది అన్నారు. మహిళల్లో ఉన్న శక్తి, నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటేందుకే హైటెక్ సిటీలో స్టాల్స్ ఏర్పాటు చేశామన్న సీఎం.. మహిళా శక్తిని గొప్పగా చాటే బాధ్యత మీపైనే ఉందని వ్యాఖ్యానించారు. డిసెంబర్ 9న సచివాలయంలో ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి

మిగతా 2లో



# మంచి భోజనం పెట్టండి..!

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై హైకోర్టు ఆదేశాలు
- అస్వస్థతకు గురైన సంఘటనలపై పూర్తి నివేదిక ఇవ్వాలన్న కోర్టు

మిగతా 2లో



# బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- కుటుంబ పాలనతో ప్రజల స్వేచ్ఛను హరించారు
- మాది ప్రజాకాంక్ష సర్కార్.. ఆ మేరకే పాలన అందిస్తున్నాం
- ఫాంహౌస్ కు పరిమితమైన కేసీఆర్ తన పిల్లల్ని పట్టించుకోవడం లేదు
- ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి
- ప్రజల నుంచి 103 దరఖాస్తుల స్వీకరణ

మిగతా 2లో




# కౌశిక్‌రెడ్డి అరెస్టు.. ఉద్రిక్తత

- బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించిన కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అడ్డుకునేందుకు భారాస శ్రేణుల యత్నం
- వేర్వేరు ఠాణాలకు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల తరలింపు



మిగతా 7లో

# తప్పుని నిరూపిస్తే క్షమాపణ చెబుతా

- ఏడాది పాలనలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం
- కేసీఆర్, మోదీ వచ్చి లెక్క వేసుకోవాలి
- బీఆర్ఎస్ పాలకులు నోటిఫికేషన్లు ఇచ్చి పారిపోయారు
- హైదరాబాద్ కు ఢిల్లీ పరిస్థితి రానివ్వం
- కాలుష్య నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీని పునర్జీవం చేశాం
- దొడ్డు వడ్లు తింటలేరు.. సన్నాలే పండించండి
- రవాణాశాఖ లోగోను ఆవిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**




ఉద్యోగాల కోసం ప్రాణత్యాగం చేసిన యువత ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందులో ఒక్క తల తగ్గినా తాను క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని సంచలన ప్రకటన చేశారు. కేసీఆర్, ప్రధాని మోదీ ఎవ్వరు వచ్చి లెక్క పెట్టుకున్నా ఆహ్వానిస్తామన్న ఆయన 55 వేల నియామకాల్లో ఒక్కరు తగ్గినా తప్పు ఒప్పుకుంటానని సీఎం స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకులు వారి పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి పారిపోతే.. కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కరించి మొదటి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన సభలో రవాణాశాఖ లోగోను ఆవిష్కరించిన రవాణాశాఖ, ఆర్టీసీ విజయాలపై కరపత్రం విడుదల చేసిన సీఎం.. 54 మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కాలుష్యంతో ఢిల్లీ నగరంలో

మిగతా 2లో



# బీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- కుటుంబ పాలనతో ప్రజల స్వేచ్ఛను హరించారు
- మాది ప్రజాకాంక్ష సర్కార్.. ఆ మేరకే పాలన అందిస్తున్నాం
- ఫాంహౌస్ కు పరిమితమైన కేసీఆర్ తన పిల్లల్ని పట్టించుకోవడం లేదు
- ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి జూపల్లి
- ప్రజల నుంచి 103 దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగించిన మాజీ సీఎం కేసీఆర్.. ప్రజల స్వేచ్ఛను హరించారన్నారు. ప్రతిపక్షంతో పాటు స్వపక్ష గొంతునొక్కిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. గురువారం గాంధీభవన్ లో జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన 103 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆయన కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలిందన్న ఆయన సంక్షేమం, అభివృద్ధి పేరుతో ఆ పార్టీ నేతలు ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కౌశిక్ రెడ్డిల అరెస్ట్ విషయంపై స్పందిస్తూ.. ప్రజాస్వామ్యంలో చట్టానికి ఎవరు అతీతులు కారన్న ఆయన చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. పిల్లలు తప్పు చేస్తే మందలించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల ది అన్నారు. పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్ మాత్రం కేవలం ఫాం హౌస్ కు పరిమితమయ్యారని విమర్శించారు. ఈ క్రమంలో తన కొడుకు,అల్లుడిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల అకాంక్షల మేరకు నడుచుకుంటుందని చెప్పారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని తాము సద్వినియోగం చేసుకుంటున్నామన్న మంత్రి.. ముఖ్యమంత్రి అందరినీ కలుపుకొనిపోతున్నారని ప్రశంసించారు. అలాగే తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవరిస్తోందన్నారు. అలాగే గత పాలకుల మాదిరిగా నిరంకుశంగా వ్యవహరించడం లేదన్న మంత్రి.. పార్టీలు, సంఘాలతో సంబంధం లేకుండా ధర్నాలు చేసుకునే స్వేచ్ఛను ఇచ్చామన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు, అవకాశాన్ని దుర్వినియోగం చేస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహాత్మా జ్యోతిబాపూలే భవన్ తో పాటు జిల్లాల్లో ప్రజా వాణి ద్వారా ప్రజల వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు వారంలో ఒక రోజు మంత్రులు గాంధీ భవన్లో ఉండేలా ప్రజలతో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం ద్వారా సరికొత్త సంప్రదాయానికి తెరలేపారన్నారు. గాంధీభవన్ లో కూడా పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజల సమస్యలు వింటున్నామని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నామన్న జూపల్లి తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోందని,వారు ఎంత గీపెట్టిన ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని వెల్లడించారు. కాగా ముఖాముఖి కార్యక్రమానికి విచ్చేసిన బాధితులు ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,ఫించన్లు, రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులకు స్వీకరించినప్పుడు మంత్రి జూపల్లి ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వాటిని పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# తప్పుని నిరూపిస్తే క్షమాపణ చెబుతా

మొదటి పేజీ తరువాయి

అప్రకటిత లాక్ డౌన్ విధించారన్న సీఎం కొన్నేళ్ళ తర్వాత ప్రజలు ఢిల్లీని విడిచి వెళ్లిపోవడం ఖాయమన్నారు. హైదరాబాద్ నగరానికి అలాంటి పరిస్థితి రాకుండా చేసేందుకు స్క్రాప్ పాలసీ తీసుకు వచ్చామన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ కు పంపి కాలుష్యం తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ)కొన్నవారికి రిజిస్ట్రేషన్ ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. రానున్న రెండేళ్లలో ఆర్టీసీలో ఉన్న డీజిల్ బస్సులను సిటీ బయటికి తరలించి, 3వేల ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామని సీఎం ప్రకటించారు. డీజిల్ ఆటోలను కూడా సిటీ అవతలికి తరలిస్తామన్నారు. ఎలక్ట్రిక్ ఆటోలు కొన్నవారికి రాయితీలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. గోదావరి నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్లో నింపి మూసీ నదిలో మంచి నీరు పారిస్తామని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా మార్చేందుకు రూ.7 వేల కోట్లతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని, దానికి ప్రజల సహకారం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను విజయవంతంగా అమలు చేశామన్న సీఎం ముఖ్యంగా గత పాలకులు ఆర్టీసీని నష్టాల్లోకి నెడితే తాము ఆర్టీసీకి మహాలక్ష్మి పథకం కింద రూ.4 వేల కోట్ల సబ్సిడీ మంజూరు చేసి, సంస్థను లాభాల పట్టించామన్నారు.ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి నష్టాల్లో ఉన్న ఆ సంస్థను పునరుజ్జీవింప చేశామన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రతీ ఆడబిడ్డ ప్రతీ నెలా రూ.5 నుంచి రూ.7 వేలు ఆదా చేయగలుగుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అయినా, తానైనా బాధ్యతాయుతంగా రవాణా కార్మికుల ఆకాంక్షలను గౌరవించాల్సిందేనన్నారు. గత పదేళ్ల పాలనలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా ప్రభుత్వం నుంచి పరామర్శించిన దాఖలాలు లేవని చెప్పారు.

**దొడ్డు వడ్లు పండించొద్దు...!**

రాష్ట్రంలో రైతులు ఇకపై దొడ్డు వడ్లు పండించొద్దని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం దొడ్డు వడ్లను ప్రజలు తినే పరిస్థితిలో లేవన్న ఆయన ప్రజలెవ్వరూ దొడ్డు బియ్యం తినడం లేదన్నారు. రేషన్ షాపుల్లో ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని ఆ నిర్వహాకులే బ్లాక్ మార్కెట్ కు తరలించి.. సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ వరి వేస్తే ఉరి వేసుకున్నట్టే అని రైతులను బెదిరిస్తే.. తాము రైతులకు బోనస్ లు ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సన్నవడ్లు ఎక్కువగా పండిస్తే.. రేషన్ ద్వారా పేద ప్రజలకు, అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో సన్నబియ్యం ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్టీసీకి మంచిరోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 115.76 కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు. దీంతో సుమారు రూ.3,902 కోట్లు ఆదా అయిందన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ పాల్గొన్నారు.

# అధికార, ప్రతిపక్షం కలిస్తేనే ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి




అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.ప్రతి దానికి అడ్డు తగలకూడదనే ఇంగితం హరీశ్ రావు, కేటీఆర్ కు లేకపోవచ్చని.. వారిది చిన్న పిల్లల మనస్థత్వమని సీఎం అన్నారు. పెద్ద వారైన కేసీఆర్ వారికి సర్ది చెప్పాలన్నారు. ఇష్టారీతిగా వ్యవహరించడం ఎవరికీ మంచిది కాదని.. అలా చేసే వారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ వాళ్లు చేయలేనిది తాము ఏడాది కాలంలోనే చేస్తుంటే.. హోం వర్క్ చేయని పిల్లలు హోం వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్లు మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనం చేయలేని పని వాళ్లు చేస్తున్నారనీ, చూస్తూ ఉండాలని వారిద్దరికి హితవు చెప్పాలని కేసీఆర్కు సూచించారు. కుటుంబ పెద్దగా... తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని కేసీఆర్ ను కోరారు. కొందరు వారిని తమపై ఉసి గొల్పుతున్న విషయం గ్రహించాలన్న సీఎం వారిని అలా వదిలేయవద్దంటూ వ్యంగస్త్రాలు సంధించారు. ఇప్పటి వరకు తాము మిమ్మల్ని అవమానించి, అనుమానించింది లేదన్న రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా కేసీఆర్ తన పెద్దరికాన్ని నిలబెట్టుకోవాలన్నారు.

**రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదు..!**

రాష్ట్రంలో గుడి లేని ఊరు ఉంటుంది కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. నిజమైన అర్హులకే ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నామన్న సీఎం ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనతో పాటు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అన్నారు. తొలి ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తున్నామనీ ఇప్పటికే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. అలాగే కేసీఆర్ రద్దు చేసిన గృహనిర్మాణ శాఖను పునరుద్ధరించినట్లు వివరించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులోనూ నిబంధనలను సవరించినట్లు తెలిపారు. ఐటిడిఏ ప్రాంతాల్లో అదనంగా ఇండ్లు మంజూరు చేస్తామన్న రేవంత్ రెడ్డి.. గోండులు, ఆదివాసీలకు మేలు చేసేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 60 వేల నుంచి 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. వాళ్లు అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను కూడా తాము పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలు తెలంగాణ రైజింగ్ అనుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందిరమ్మ కూడు, గూడు, గుడ్డ ప్రతీ వారికి అందించాలని నినాదించారని సీఎం తెలిపారు. తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివాసీ గుడాల్లో తిరిగి వచ్చామన్న సీఎం.. వారి సమస్యలన్నీ విన్నామన్నారు. ఐటిడిఏ ప్రాంతాల్లో అదనంగా ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఆదివాసీలకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. వారికి ప్రత్యేక ప్యాకేజి ఉంటుందని తెలిపారు. ఆత్మ గౌరవంతో బతకాలనే పేదల కలను ఇందిరా గాంధీ ఆనాడే గుర్తించారన్నారు. కూడు, గూడు, గుడ్డ ప్రతి ఒక్కరికీ అందించాలనేది ఇందిరమ్మ ఆలోచన అన్న ముఖ్యమంత్రి.. వ్యవసాయ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తో పేదలకు పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఎస్సి,ఎస్టీలకు ఉన్న భూమి వారి తల్లిదండ్రుల ఇచ్చింది కాదనీ ఇందిరమ్మ ఇచ్చారన్నారు.

**కేసీఆర్ ఆలోచన మారాలి..!**

ప్రతిపక్ష హోదాలో ఉన్న సీనియర్ నాయకుడు కేసీఆర్ తన ఆలోచన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత రాజశేఖర్ రెడ్డి, రాజశేఖర్రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని.. నాడు ఆ మంచి సంప్రదాయం ఉందని.. దానిని కొనసాగించాలని సీఎం సూచించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్ రావు ఆయను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారని... కాంగ్రెస్లో చేరేందుకే హరీశ్రావు కలిశారనే విమర్శలు నాడు వచ్చాయని సీఎం అన్నారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం రాజశేఖర్ రెడ్డిని కలిశానని హరీశ్ చెప్పారని.. ఇప్పుడు అలానే కలిసి సమస్యలు విన్నవించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్నప్పుడే రాజశేఖర్రెడ్డిని హరీశ్రావు కలిశారని.. మరి ఇప్పుడేమైందని సీఎం ప్రశ్నించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని సీఎం తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు కలవకుండా చేసింది కేసీఆరేనని, శత్రుదేశ సైనికుల్లా రెండు పక్షాలను కేసీఆర్ మార్చివేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్లో మానసిక పరివర్తన రావాలని సీఎం అన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంతగా ఉన్నా ఆ రాష్ట్ర అంశాల విషయంలో పార్టీలకు అతీతంగా వారంతా ఏకమవుతారని.. ఇక్కడ అలానే కావాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్ను.. రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

**వాళ్లు 65 వేల ఇళ్లు నిర్మిస్తే మేం 25లక్షలు నిర్మించాం**

2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను పిట్ట గూళ్లని.. కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని ఎన్నికల ప్రచార సభల్లో విమర్శలు గుప్పించిన కేసీఆర్ తన పదేళ్ల పాలనా కాలంలో కేవలం లక్ష డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ప్రారంభించి 65 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇళ్ల పూర్తికి తాము రూ.195 కోట్లు కేటాయించామన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదని...కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి ప్రగతి భవన్ను, వాస్తు కోసం సచివాలయాన్నినిర్మించుకున్నారన్నారు. గజ్వేల్, జన్వాడల్లో ఫాంహౌస్లు నిర్మించుకున్నారన్న సీఎం బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని, ఆయన చెప్పినట్లు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదని.. కానీ కాలనీకో బెల్టు షాపు పెట్టారని సీఎం విమర్శించారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమల్లో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందన్నారు. పేదవాళ్లకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను సైతం వినియోగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పునాది స్థాయి నుంచి స్లాబు స్థాయి వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడమే కాకుండా శాఖకు పూర్తి స్థాయి సిబ్బందిని ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ , ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నా రెడ్డి, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఆహ్వానం..!**

**ఈ నెల 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రతిపక్ష నేత కేసీఆర్,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్తో పాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు.కేసీఆర్ తో పాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కలిసి ఆహ్వానిస్తారని సీఎం తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేత వచ్చి పెద్దరికం నిలుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం.. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహిస్తామన్న సీఎం తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. తో బోనాలు, వినాయక నిమజ్జనం తరహాలో పండుగ వాతావరణంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలంతా వాటిలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. తమిళనాడులో ఉన్న రాజకీయ స్ఫూర్తి మనకు ఎందుకు లోపించిందో అర్థం కావడం లేదన్నారు. మీరు ఇష్టపడ్డా లేకున్నా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిందేనన్న రేవంత్ రెడ్డి.. నిజాం ప్రభువుకే రాజ్యాన్ని వదిలి వెళ్లడం తప్పలేదనే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు.**



# కేసీఆర్‌ను తప్పుబడుతూనే ఉంటా

మొదటి పేజీ తరువాయి

ఇంటర్వ్యూలో ఆయన కేసీఆర్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ధనవంతమైన తెలంగాణలో బ్రహ్మాండమైన యూరోపియన్ స్కూళ్లను కట్టాల్సిన అవకాశం ఉన్న తరుణంలో డబ్బులను నాశనం చేశారని విమర్శించారు.రైతులు కానీ రైతులకు రైతుబంధు రూపంలో కొన్ని రూ.వేల కోట్లు ధారాదత్తం చేశారని మండిపడ్డారు. పిచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ఆయన చెత్త కార్యక్రమాల మీద ఖర్చు పెట్టి రాష్ట్రాన్ని నాశనం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కేసీఆర్ చేసిన అన్యాయం, పాపం, అనాలోచిత నిర్ణయాలు ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాల్సిన అంశాలన్నారు.



# అదానీ, అంబానీలతో పోటీపడాలి

మొదటి పేజీ తరువాయి

విగ్రహాన్ని కార్యక్రమానికి లక్ష మంది మహిళలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ తో కలిసి స్వయం సహాయక మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన మహిళలు.. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాల గురించి గవర్నర్ కు వివరించారు. వారితో ముచ్చటించిన గవర్నర్ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేశారు.



# మంచి భోజనం పెట్టండి..!

- ప్రభుత్వ పాఠశాల్లలో మధ్యాహ్న భోజనంపై హైకోర్టు ఆదేశాలు
- అస్వస్థతకు గురైన సంఘటనలపై పూర్తి నివేదిక ఇవ్వాలన్న కోర్టు
- ఆరు వారాల గడువు
- ఫుడ్ పాయిజన్ ఘటనల్లో రెండు కమిటీలు వేశామన్న ప్రభుత్వం తరపు న్యాయవాది
- బాధ్యులను సస్పెండ్ చేసినట్లు వాదనలు
- భోజనంపై ఆదేశాలిచ్చిన న్యాయస్థానం

తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై దాఖలైన పిటిషన్ పై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఘటనకు సంబంధించిన పూర్తి నివేదికను సమర్పించాలని సూచించింది.ఇటీవల వరుస ఫుడ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోవడంపై దాఖలైన పిటిషన్ ను విచారించిన న్యాయస్థానం ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విద్యార్థులకు నిర్దేశించిన పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే కలుషిత ఆహారం కారణంగా బడి పిల్లలు అస్వస్థతకు గురైన సంఘటన పూర్తి నివేదికను సమర్పించాలని సూచిస్తూ తదుపరి విచారణను మరో 6 వారాలు వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇప్పటికే ఫుడ్ పాయిజన్ ఘటనల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పీఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలుండాలన్నారు. కమిటీల పర్యవేక్షణ సరిగా లేనందుకే ఇలా జరుతున్నాయని చెప్పారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. దీంతో అన్ని కమిటీలు పని చేస్తున్నాయని ప్రభుత్వ ఏఏజీ వివరించారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది.ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ఘటనలో 6 వారాల్లో నివేదిక సమర్పించాలని అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ఖాన్ను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధె, జస్టిస్ జె.శ్రీనివాస్రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ పేర్కొన్న మూడు ఘటనలే కాకుండా మరో రెండు ఘటనలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని ఆయా ఘటనలో బాధ్యులైన వాళ్లపై చర్యలు తీసుకున్నట్లు ఏఏజీ ఇమ్రాన్ఖాన్ కోర్టుకు తెలిపారు. నారాయణపేట్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా రెండు కమిటీలు ఏర్పాటు చేశామని భోజనం వికటించిన ఘటనపై అధ్యయనం చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్కు పంపామన్నారు. 25వేల 941 ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మందికి పైగా విద్యార్థులన్నారని వాళ్లలో 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారని ఏఏజీ వివరించారు. ఈ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర మార్గనిర్దేశకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని కానీ క్షేత్రస్థాయిలో ఇలా చోటు చేసుకోవడం లేదని పిటీషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు.

**ఆహారంలో గుడ్డు కూడా ఇవ్వడం లేదు**

మధ్యాహ్న భోజనంలో సరైన ఆహారం పెట్టడం లేదని గుడ్డు కూడా ఇవ్వడం లేదని కోర్టుకు తెలిపారు. ఆ కమిటీలకు అదనంగానే ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై అధ్యయనానికి మరో రెండు కమిటీలు ఏర్పాటు చేశామని అన్ని కమిటీలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డించే ఏజెన్సీలకు ప్రభుత్వం ఇటీవలే 40 శాతం డబ్బులు పెంచినట్లు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హైదరాబాద్‌లో ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం భారీగా నిధులు విడుదల

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అంట్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న పనులు కోసం రేవంత్ సర్కార్ భారీగా నిధులు విడుదల చేసింది. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ మొత్తం రూ.5,942 కోట్ల నిధుల విడుదలకు పర్మిషన్ ఇచ్చారు. వెంటనే టెండర్లకు పిలిచి ఈ నిధులతో రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఇదిలాఉండగా.. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హెచ్ సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే లోని ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ జోన్‌లో ఏవోసీ సెంటర్ చుట్టూ రహదారులు నిర్మించేందుకు అత్యధికంగా రూ.940 కోట్ల విడుదలకు పర్మిషన్లు ఇచ్చింది. ఇక శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ట్రిపుల్ ఐటీ, విప్రో జంక్షన్ల అభివృద్ధి కోసం రూ.837 కోట్లు మంజూరు చేసింది. మియాపూర్ క్రాస్ రోడ్డు నుంచి ఆల్విన్ క్రాస్ రోడ్డు వరకు ఆరు వరుసల ఫ్లై ఓవర్, లింగపల్లి నుంచి గచ్చిబౌలి వైపునకు మూడు వరసలతో అండర్ పాస్ నిర్మాణం కోసం రూ.530 కోట్లు కేటాయించింది.

మరోవైపు LB నగర్ జోన్‌లో టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు లేన్ల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు విడుదల చేసింది. అలాగే ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్ నగర్ జంక్షన్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణ కోసం రూ.398 కోట్లు మంజూరు చేసింది. దీంతో త్వరలోనే రహదారి విస్తరణ పనులు జరగనున్నాయి.

# ఇకపై షెడ్యూల్ ప్రకారమే పోటీ పరీక్షలు

- నిరుద్యోగుల్లో భరోసా కల్పిస్తా
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం
- నాంపల్లి కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ఉద్యోగ నోటిఫికేషన్లు.. పరీక్షల నిర్వహణ.. ఫలితాల వెల్లడి ఇలా అన్ని అంశాల్లో టీజీపీఎస్సీ ఇకపై షెడ్యూల్ ను అనుసరిస్తుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు పూర్తి విశ్వాసం కలిగించడం తన బాధ్యత అని భరోసా ఇచ్చారు. టీజీపీఎస్సీ నూతన ఛైర్మన్ గా నియమితులైన ఆయన గురువారం నాంపల్లిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎలాంటి వాయిదాలు ఉండవని.. అలాంటి ఆలోచనలు ఉంటే తొలగించుకోవాలని నిరుద్యోగ అభ్యర్థులకు సూచించారు. పరీక్ష జరిగిన 60 రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగాల భర్తీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలనే మూడున్నర ఏళ్ల సర్వీస్ ను వదులుకొని వచ్చినట్లు తెలిపిన ఆయన యూపీఎస్సీ తో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని కొనియాడారు. అలాగే పరీక్షలు తమ కష్టం, ప్రతిభ, తమ మీద నమ్మకంతో రాయాలని నిరుద్యోగ అభ్యర్థులకు సూచించిన వెంకటేశం.. ఎవరైనా పైరవీ చేస్తానంటే అలాంటి వారి గురించి వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. త్వరలోనే పబ్లిక్ కు అందుబాటులో ఒక ఫోన్ నంబర్ పెడతామని వెల్లడించారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ కు ఉన్న విస్తృత అధికారాలను వినియోగించుకొని అందరికీ న్యాయం చేస్తామని వెంకటేశం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు,సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.




# సీఎంగా ఫడణవీస్.. తొలి సంతకం దేనిపైనంటే..?

**తెలంగాణ ముచ్చట్లు, ముంబయి:**

మహారాష్ట్రలో నూతన ప్రభుత్వం కొలువు తీరింది. ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణస్వీకారం చేశారు. దీంతో కొంతకాలంగా రాష్ట్రంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అయితే, సీఎం బాధ్యతలు తీసుకున్న ఫడణవీస్.. తొలి సంతకం ఒక రోగికి ఆర్థిక సాయం అందించే దస్త్రంపై చేశారు. పుణెకు చెందిన చంద్రకాంత్ అనే వ్యక్తి బోన్‌మ్యారో మార్పిడి చికిత్స కోసం ఎదురుచూస్తున్నారు. అందుకు అతడి భార్య సీఎం సహాయ నిధుల నుంచి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో బాధితుడికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందించే దస్త్రంపై తొలి సంతకం చేశారు.

రివెంజ్ కాదు.. పొలిటికల్ ఛేంజ్ చూస్తారు

రానున్న ఐదేళ్లలో ప్రజలకు స్థిరమైన పాలన అందిస్తామని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. తన సారథ్యంలో కొలువుదీరిన ప్రభుత్వంలో ప్రజలు రాజకీయ మార్పును చూస్తారు తప్ప ప్రతీకారాన్ని కాదన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు వారి ఆకాంక్షలు, ప్రేమకు అద్దంపడుతున్నాయన్నారు. సామాజిక, మౌలిక, పారిశ్రామిక రంగాల్లో ఇదే వేగంతో మహారాష్ట్రను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

9న స్పీకర్ ఎన్నిక

‘‘డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం. 9న స్పీకర్ ఎన్నిక చేపడతాం. గత రెండున్నరేళ్లలో మహారాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేశాం. ఇప్పుడూ అలాగే కృషి చేస్తాం. మా డైరెక్షన్, స్పీడ్ అలాగే ఉంటుంది. మ్యానిఫెస్టోలో ఇచ్చిన మేరకు హామీలు పూర్తి చేస్తాం. ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరిగిందని నేను భావించడంలేదు. 2004లో కూడా 12 13 రోజుల పాటు ఆలస్యం జరిగింది. 2009లో తొమ్మిది రోజులు ఆలస్యమైంది.

**ఆ ఇద్దరూ నాతో ఉన్నారు..**

సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇందుకోసం పెద్ద ఎత్తున సంప్రదింపులు జరగాల్సి ఉంటుంది కదా. మంత్రి పదవులను దాదాపు ఖరారు చేశాం. ఇంకా కొంత మిగిలి ఉంది. ఏక్‌నాథ్‌శిందే, అజిత్ పవార్ నాతో ఉన్నారు. క్యాబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపుపై మేం చర్చించి నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వంలో మంత్రుల పనితీరు ఆధారంగానే తదుపరి నిర్ణయం తీసుకుంటాం’’ అని ఫడణవీస్ వివరించారు.

# గాజా విషయంలో భారత్ వైఖరి అదే.. పార్లమెంట్‌లో జైశంకర్ వివరణ



**తెలంగాణ ముచ్చట్లు,**

గాజా సమస్య కు ‘ద్విదేశ’ పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. ఆయన పార్లమెంట్‌లో నేడు ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ ఈవిషయాన్ని వెల్లడించారు. గాజాపై చేసే ఏ తీర్మానంలో అయినా ఉగ్రవాదం, హమాస్ బందీల అంశం ప్రస్తావించకపోతే.. అది వాస్తవిక పరిస్థితిని ప్రతిబింబించదు.. సమతౌల్యంగా ఉండదని చెప్పారు.

‘‘భారత్ స్వయంగా ఉగ్రవాద బాధిత దేశం. అలాంటిది మనమే ఉగ్రవాదాన్ని విస్మరించడం, తక్కువగా చూపడం వంటివి మన ప్రయోజనాలకు విరుద్ధం. ఎటువంటి తీర్మానాన్ని అయినా.. అందులో వాడిన పదాలతో సహా పరిపక్వతతో భారత్ చూస్తుంది. ఉగ్రవాదాన్ని, ప్రజలను బంధించడాన్ని న్యూదిల్లీ ఖండిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ దేశానికి అయినా ప్రతిస్పందించే హక్కు ఉంటుందని నమ్ముతాము. అదే సమయంలో ఆయా దేశాలు సాధారణ పౌరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. మానవీయ చట్టాలకు, కాల్పుల విరమణకు, హింస ముగింపునకు భారత్ మద్దతు ఇస్తుంది’’ అని విదేశాంగ మంత్రి పేర్కొన్నారు.

ఇక ఇజ్రాయెల్‌లో రక్షణ సహకారంపై ఆయన మాట్లాడుతూ.. దీనికి సంబంధించిన నిర్ణయాలు జాతీయ భద్రతా ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని తీసుకొంటామన్నారు. ‘‘జాతీయ భద్రతా ప్రయోజనాల విషయంలో ఇజ్రాయెల్‌తో బలమైన బంధం ఉంది. మన భద్రత ప్రమాదంలో పడిన సందర్భాల్లో అండగా నిలిచిన దేశం అది. మనం జాతీయ భద్రతా ప్రయోజనాలను బట్టి ఓ నిర్ణయం తీసుకొంటాం’’ అని పేర్కొన్నారు.

ఇజ్రాయెల్‌లో యూఎన్‌ఆర్‌ఏడబ్ల్యూ సంస్థను బ్యాన్ చేయడంపై భారత్ వైఖరిని టీఎంసీ నేత సాకేత్ గోఖలే ప్రశ్నించారు. ఆ సమయంలో వెస్ట్‌బ్యాంక్‌లో అక్రమ సెటిల్మెంట్లపైనా విదేశాంగ మంత్రి స్పందించాలని కోరారు. దీనికి జైశంకర్ సమాధానమిస్తూ ‘‘యూఎన్‌ఆర్‌ఏడబ్ల్యూకు మద్దతు ఇవ్వడంతోపాటు సహకరించాలని భారత్ నిర్ణయించింది. దానికే కట్టుబడి ఉంటాము. తాజాగా ఆ సంస్థకు సాయం కూడా పంపించాము’’ అని పేర్కొన్నారు. ఆ సంస్థకు ఏటా ఐదు మిలియన్ డాలర్ల సాయం పంపిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాలస్తీనా ప్రజలకు అవసరమైన సాయం భారత్ నుంచి అందుతోందన్నారు. 70 మెట్రిక్ టన్నుల సహాయ సామగ్రి, 16.5 మెట్రిక్ టన్నుల ఔషధాలను పంపించినట్లు చెప్పారు.

# ఢిల్లీ ప్రజలకు ఊరట.. మెరుగుపడ్డ గాలి నాణ్యత

**తెలంగాణ ముచ్చట్లు ,ఢిల్లీ:**

గత కొంతకాలంగా వాయు కాలుష్యంలో చిక్కుకున్న ఢిల్లీ ప్రజలకు కాస్త ఊరట లభించింది. తాజాగా అక్కడి గాలి నాణ్యత సూచి )లో మెరుగుదల కనిపించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్4 విధించిన రూల్స్ సత్ఫలితాలను ఇచ్చాయి. దీంతో ఈ ఆంక్షల సడలింపునకు సుప్రీంకోర్టు పర్మిషన్ ఇచ్చింది. ఇక వివరాల్లోకి వెళ్తే.. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాలు తగలబెట్టడం వల్ల ఏటా శీతాకారం ప్రారంభంలో ఢిల్లీఎన్సీఆర్ పరిధిలో గాలి నాణ్యత తీవ్రంగా పడిపోతుంది. ఈసారి కూడా అలానే జరగడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్4 ఆంక్షలు విధించింది. అయితే తాజాగా ఎయిర్ క్వాలిటీలో మెరుగదల కనిపించడంతో సుప్రీంకోర్టు ఆంక్షల సడలింపునకు అనుమతి ఇచ్చింది. దీంతో ఢిల్లీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంట వ్యర్థాలను పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించేలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి తెలిపారు.

ఇదిలాఉండగా.. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(AQI) 0-50 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగుందని అర్థం. 51-100 మధ్య ఉండే సాధారణ స్థితి, 101-200 ఉంటే క్షీణ దశకు చేరువలో ఉందని అర్థం. ఇక 201 -300 ఉంటే గాలి నాణ్యత క్షీణించిందని, ఇక 400 సూచి దాటితే తీవ్రంగా క్షీణించినట్లు సూచిస్తుంది. ఢిల్లీలో గత కొన్నిరోజులుగా 400లకు పైగానే గాలి నాణ్యత ఉంది. దీంతో అక్కడ చాలామంది అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఢిల్లీలో గాలి నాణ్యతను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో కృత్రిమ వర్షాన్ని కురిపించాలని ఢిల్లీ ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కానీ ఇది కుదరలేదు. చివరికి జీఆర్‌ఏపీ విధించిన ఆంక్షలు ఫలించాయి. అయినప్పటికీ ప్రతీ సంవత్సరం ఢిల్లీలో ఇలా గాలి నాణ్యత విపరీతంగా తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.



# జులానీ.. సిరియాలో ప్రకంపనలు సృష్టించిన అదృశ్య శక్తి!

**తెలంగాణ ముచ్చట్లు, సిరియా**

సిరియాలో మళ్లీ సంక్షోభం ముసురుకుంటోంది. గత కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్న సిరియాలో మరోసారి తిరుగుబాటు తారస్థాయికి చేరింది. ఆ దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటుదారులు విజృంభిస్తున్నారు. మూడు రోజుల్లోనే సిరియాలో రెండో అతిపెద్ద పట్టణం అలెప్పోను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి అబు మహ్మద్ అల్ జులానీ అసలెవరీ జులానీ? అతడి నేపథ్యమేంటి?అలెప్పో నగరంపై తాజా దాడి వెనుక ఒకప్పటి అల్ ఖైదా అనుబంధ సంస్థ హయాత్ తహరీర్ అల్‌షమ్ (హెచ్‌టీఎస్)ది కీలక పాత్ర. సిరియాలోనే అత్యంత పటిష్ఠమైన తిరుగుబాటు దళమిది. దాని అధిపతే అబు మహ్మద్ అల్ జులానీ. గతంలో జరిగిన రష్యా దాడుల్లో జులానీ మరణించాడని అంతా భావించారు. కానీ, అవన్నీ బూటకపు వార్తలేనని తాజాగా తేలింది. ప్రస్తుతం హెచ్‌టీఎస్‌ను అతడే ముందుండి నడిపిస్తున్నాడు.

**రియాద్‌లో జన్మించి.. సిరియాకు వచ్చి..**

జులానీ పూర్వీకులు సిరియాకు చెందిన వారే. అయితే, ఆయన తండ్రి అహ్మద్ హుస్సేన్ అల్ షారా సౌదీ అరేబియాలో పెట్రోలియం ఇంజినీర్‌గా పని చేసేవారు. జులానీ 1982లో సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో జన్మించాడు. ఆ తర్వాత ఆ కుటుంబం 1989లో మళ్లీ సిరియాకు వచ్చి డమాస్కస్‌లో స్థిరపడింది. అక్కడే పెరిగిన జులానీ 2003లో ఇరాక్ వెళ్లి.. అల్ ఖైదాలో చేరాడు. 2006లో అమెరికా దళాలు అతడిని అరెస్టు చేశాయి. ఐదేళ్ల తర్వాత విడుదలైన జులానీ.. తిరిగి సిరియా చేరుకొని అక్కడ అల్ ఖైదా శాఖను తెరచాడు. ‘అల్ నుస్రా ఫ్రంట్’ ను ఏర్పాటు చేసి ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న ఇడ్లిబ్ లాంటి ప్రాంతాల్లో బలీయమైన శక్తిగా ఎదిగాడు.

తొలినాళ్లలో ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాక్ (తర్వాతి కాలంలో ఐసిస్‌గా మారింది) అగ్రనేత అబూ బకర్ అల్ బగ్దాదీతో సంబంధాలను నెరపాడు. అయితే, అల్ ఖైదాతో సంబంధాలు తెంచుకున్నట్లు 2013 ఏప్రిల్‌లో అల్ బగ్దాదీ సంచలన ప్రకటన చేశాడు. అంతేకాకుండా తమ గ్రూప్‌ను సిరియాకు విస్తరిస్తున్నట్లు చెప్పాడు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం అల్ నుస్రా ఫ్రంట్‌ను తనలో విలీనం చేసుకోవాలని చూశాడు. అయితే, అది జులానీకి నచ్చలేదు. అల్ ఖైదాతోనే తన సంబంధాలను కొనసాగించాడు. అయితే, అన్ని ముస్లిం దేశాల్లో తమ సొసైటీలను ఏర్పాటు చేయాలన్న అల్ ఖైదా విధానం జులానీకి నచ్చలేదు. క్రమంగా అల్‌ఖైదాకు దూరంగా జరుగుతూ.. సిరియా సరిహద్దుల్లో తన బలాన్ని పెంచుకోవడంపై దృష్టిపెట్టాడు.

**హెచ్‌టీఎస్ పురుడుపోసుకుంది అప్పుడే..**

2011లో అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఈ ఉద్యమాన్ని అసద్ అణచివేయడానికి ప్రయత్నించడంతో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ప్రభుత్వ దళాలు.. తిరుగుబాటుదారుల మధ్య జరిగిన ఈ పోరులో దాదాపు 6 లక్షల మందికి పైగా పౌరులు చనిపోయారు. నగరాలకు నగరాలే ధ్వంసమయ్యాయి. జూలై 2016లో అలెప్పో నగరంలో తిరుగుబాటు దారులపై సాయుధ బలగాలు దాడులకు దిగాయి. దీంతో వారంతా ఇడ్లిబ్ వైపు కదిలారు. అదే సమయంలో తన అల్ నుస్రా గ్రూప్‌ను ఫతేహ్ అల్ షామ్‌గా మార్చేశాడు జులానీ.

వేలాది మంది తిరుగుబాటు దారులతో కలిసి 2017 ప్రారంభంలో హెచ్‌టీఎస్‌ను స్థాపించాడు. హరకత్ నూర్ అల్ దిన్ అల్ జింకి, లివా అల్ హక్ అండ్ జైషే అల్ సున్నా లాంటి ఉగ్ర సంస్థలు ఇందులో భాగస్వాములుగా చేరాయి. అసద్ నిరంకుశ ప్రభుత్వం నుంచి సిరియాను విముక్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని హెచ్‌టీఎస్ చెబుతోంది. సిరియా నుంచి ఇరానియన్లను బహిష్కరించి.. ఇస్లామిక్ చట్టం ప్రకారం నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నది హెచ్‌టీఎస్ లక్ష్యం.

**లక్ష్యం దిశగా జులానీ పావులు**

అందుకు అనుగుణంగా జులానీ 2016 నుంచే పావులు కదుపుతున్నాడు. అధ్యక్షుడు అల్ అసద్ వ్యతిరేకులందర్నీ ఏకతాటి పైకి తీసుకొస్తున్నాడు. హెచ్‌టీఎస్‌పై ఉన్న అల్‌ఖైదా ముద్రను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాడు. హెచ్‌టీఎస్‌ను అమెరికా, ఐక్యరాజ్యసమితి ఉగ్ర సంస్థగా ప్రకటించిన నేపథ్యంలో.. తన అధీనంలోని ఉన్న ప్రాంతాల్లో పౌర పాలనపై హెచ్‌టీఎస్ దృష్టి పెట్టింది. మైనారిటీలకు చేరువయ్యే ప్రయత్నాలు చేసింది.

తిరుగుబాటుదారులు తిరిగి అలెప్పోను స్వాధీనం చేసుకున్న తరుణంలో జులానీ సిరియాలోని మైనార్టీలపట్ల మరింత అనుకూల వైఖరితో ఉన్నాడు. అయితే, ఇస్లామిక్ చట్టం ప్రకారం నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంతసులభం కాదు. సైన్యంపై పట్టు సాధించి అన్ని ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నా.. అంతర్గత విభేదాలు తలెత్తే అవకాశముంది. ఏదేమైనా సిరియాలో అతిపెద్ద ప్రతిపక్ష సాయుధ సమూహానికి అధిపతిగా జులానీ పేరు ప్రపంచ స్థాయిలో ప్రతిధ్వనిస్తోంది.

# ఇదే కదా నా ఈ లోకం

ఏముంది నా ఈ లోకంలో పగ , ద్వేషం
, ఈర్ష , కోపం తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో మానవత్వం
లేని మనుషులు , కామంతో కళ్ళు
మూసుకు పోయిన కామాంధులు
తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో కుల
మతాల కోసం కొట్టుకొని చచ్చే వారు
తప్పా...!!
ఏముంది నా ఈ లకంలో
ఒకరు బాగుపడితే ఓర్వలేని వారు ,
ఇంకొకరు బాధ పడితే ఓదార్చలేని
వారు తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో నటిస్తు
నాశనం కోరుకునే వారు , నవ్వుతూ
నట్టేట ముంచేసే వారు తప్పా...!!
ఏముంది నా ఈ లకంలో ఒకరి బాధని
చూసి సంతోష పడేవారు , ఇంకొకరి
సంతోషాన్ని చూసి ఈర్ష
పడేవారు తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో ఓడితే
ఒంటరిని చేసే వారు , గెలుస్తే గుంపు
చేరే వారు
తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో అవసరం
ఉన్నంత వరకే , అవసరం తీరాక
కనపడని వారు తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో కన్న వారికి
కూడు పెట్టలేక , కాటికి చేర్చే వారు
తప్పా...!!
ఏముంది నా ఈ లోకంలో బ్రతికి
ఉన్నపుడు మనిషిగా చూడని వారు ,
చనిపోయాక మట్టి కప్పే వారు
తప్పా...!!



హరికుమార్
70932 23020

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





న్యాయవాది దేవరాజ్ కిరణ్ కుమార్ ను

# సన్మానించిన కాంగ్రెస్ నాయకులు


**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన న్యాయవాది దేవరాజ్ కిరణ్ కుమార్ ను గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాది దేవరాజ్ కిరణ్ కుమార్ ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో దేవరాజు కిరణ్ కుమార్ కు ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం లభించిందని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి సత్య రెడ్డి, వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్నెం, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, రఘు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన

# కార్యదర్శిగా కూనూరు రాకేష్ గౌడ్

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**



తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల్లో ఎలక్షన్ కమిటీ నూతనంగా ఎన్నికైన అభ్యర్థులను ప్రకటించింది. వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హసన్ పర్తి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన కూనూరు రాకేష్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు, పార్టీ అభిమానులకు, ఓటు వేసి గెలిపించిన యువతకి రాకేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రకటనలో తెలియజేశారు.



# 9న రాష్ట్ర బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపు

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

ములుగుజిల్లా చల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్ కు నిరసనగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, ఓ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఏడుగురు విప్లవకారులకు విషమిచ్చి పోలీసులు అతి కిరాతంగా చంపారని పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై న్యాయవిచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# రైస్ మిల్లును సందర్శించిన జిల్లా కలెక్టర్

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మరిపెల్లిగూడెంలోని రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య గురువారం పరిశీలించారు. ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మిల్లుకు చేరిన సన్న, దొడ్డు రకం ధాన్యంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.మిల్లులో ధాన్యం వడగడుతున్న విధానాన్ని పరిశీలిస్తూ, ప్రాసెస్‌పై అధికారులతో చర్చించారు. ధాన్యం కొనుగోలు, ప్రాసెసింగ్ ప్రక్రియలను సమీక్షించి, నాణ్యతను పెంపొందించేందుకు అవసరమైన సూచనలు చేయడం ఈ పరిశీలనలో భాగమైంది.ఈ సందర్శనలో డిసిఓ కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేకరి కుటుంబానికి ఆర్థిక సాయం

# అందించిన వేం నరేందర్ రెడ్డి

**కేసముద్రం,తెలంగాణ ముచ్చట్లు:**

ఇటీవల అకాల మరణం చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి నాయకపు సుభాష్ కుటుంబానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి రూ. 50,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సహాయాన్ని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి వారి తరపున గంట సంజీవరెడ్డి అందజేశారు. నాయకపు సుభాష్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి సహాయంగా నిలిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని నేతలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేశముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి రాజు, నాతి రవీందర్ గౌడ్, మార్క విజయ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత శ్రీనివాస్, కుమార్ గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- **కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు వద్దు ఐదు గ్యారంటీలు ముద్దు**
- **ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ**

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**



ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ ఆధ్వర్యంలో పేద మధ్యతరగతి ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలని డిమాండ్ లతో వనపర్తి జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ లో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. నాలుగో రోజు రిలే నిరాహార దీక్ష లో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ మాట్లాడుతూ..

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద వర్గాల అందరికీ మౌలికమైన సదుపాయాలు కల్పించకుండా ప్రజాస్వామ్య బద్ధంగా కల్పించాల్సిన విద్య వైద్యం ఉపాధి భూమి ఇల్లు కల్పించకుండా రాజ్యాంగ వ్యతిరేకంగా పరిపాలన చేస్తూ 3 కోట్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజలందరిని మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వము అంటే ప్రజల కనీస అవసరాలను తీర్చుకుంటూ వారి జీవితాలలో విప్లమాత్మకమైన ఆలోచనలను,ఆచరణను కల్పిస్తూ ముందుకు సాగాలే తప్ప ప్రజలను అంతం చేసే విధంగా పరిపాలన ఉండకూడదని హితోపలికారు, 75 సంవత్సరాల నుంచి మా బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిని పట్టించుకోకుండా పాలన చేస్తున్నారని మండిపడ్డారు, దాదాపు 420 హామీలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చి ఏ ఒక్క హామీని అమలు పరచకుండా మా అనగారిన వర్గాల రక్తాన్ని తాగుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే ఈ ఐదు గ్యారంటీలను అమలు పరచాలి లేదా పరిపాలన నుండి వైదొలిగి,మా 93% ఉన్న పేద వర్గాలకు అధికారం ఇవ్వాలని డిమాండ్చేశారు, పేద వర్గాలకు అధికారం వచ్చిన అప్పుడే ఈ ఐదు గ్యారెంటీలను పకడిబందీగా అమలు చేసుకొని మేము కూడా ఆత్మగౌరవంగా ఈ సమాజంలో జీవిస్తామని తెలియజేశారు,నాలుగు రోజుల పాటు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల కార్యక్రమం నేటితో ముగిసింది, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో మరో రూపంలో ఈ యొక్క పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ యొక్క నిరాహార దీక్షల కార్యక్రమానికి సిపిఎం పార్టీ పుట్ట ఆంజనేయులు, సమాజ్ వాది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు గౌడ్,వనపర్తి జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మోహన్ కుమార్ యాదవ్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవిందస్వామి మరియు వివిధ మేధావులు విద్యావేత్తలు కుల సంఘ నాయకులు మద్దతు, సంఘీభావం తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నత్తి సుధాకర్ మహారాజ్, జిల్లా నాయకులు కురుమన్న,అశోక్,ఎల్లస్వామి, నాగరాజు,ఈశ్వర్,స్వామి కురుమన్న,రాములు, నరసింహ, వివిధ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సినీ హీరో అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకోవాలి

- **సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్**

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన విషాదకర ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనలో రేవతి అనే మహిళ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్ద సంఖ్యలో అభిమానులు ప్రీమియర్ షోకు హాజరయ్యే పరిస్థితి తెలిసినా, సరైన ఏర్పాట్లు చేయకపోవడం, అల్లు అర్జున్ నిర్లక్ష్యంతో వ్యవహరించడం ఈ ఘటనకు కారణమైందని ఆరోపణలు వచ్చాయి.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, "సినిమా ద్వారా వినోదం పంచాల్సిన హీరో, ఈ విషాదానికి కారణమవడం దారుణం. అల్లు అర్జున్‌పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి. లేనిపక్షంలో పుష్ప 2 ప్రదర్శనను రాష్ట్రవ్యాప్తంగా అడ్డుకుంటాం" అని హెచ్చరించారు.

అభిమానుల ప్రేమను దోపిడీ చేసే విధంగా టికెట్ల రేట్లను పెంచడంపై కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. సినిమా టికెట్ల ధరలు 3 వేల రూపాయల వరకు పెంచడంతో మధ్యతరగతి ప్రేక్షకులపై ఆర్థిక భారం పడిందని విమర్శకులు ఆరోపిస్తున్నారు. మామూలు ప్రజల భద్రతకు ప్రభుత్వం ప్రతిరోజూ ఆంక్షలు విధిస్తుంటే, ప్రైవేట్ కార్యక్రమాలకు మాత్రం ఎలా అనుమతులు ఇస్తున్నారనే అంశంపై ప్రశ్నలు తలెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటనపై ప్రజల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. యువత, విద్యార్థులు అలాంటి ఘటనల పట్ల అవగాహన పెంచుకోవాలని, బాధ్యతారహితంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.సమాజానికి వినోదాన్ని పంచే సినిమా విషాదం మిగల్చకూడదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు.



# మెరుగైన వైద్య సేవలను అందించాలి

**-హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**


**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**


ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు.

గురువారం హనుమకొండ జిల్లా కమలాపూర్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముప్పై పడకల ఆసుపత్రిలో ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించారు. ప్రతి రోజు వైద్య సేవల కోసం ఎంతమంది వస్తున్నారు, ఆసుపత్రి కి సంబంధించిన వాహనాలు ఎన్ని ఉన్నాయి, ఎలా పనిచేస్తున్నాయి, వాటి పరిస్థితి ఏంటి, ఆసుపత్రి లో తాగునీటి పరిస్థితి, ఎక్కడి నుండి వస్తుందనే వివరాలతో పాటు ప్రసూతి సేవల విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ఆస్పత్రి కి సంబంధించిన విషయాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్, మందుల విభాగాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి లో సాధారణ ప్రసవాలు అయ్యేట్టు చూడాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వృద్ధురాలని ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, డిఆర్డీఓ పి.డి. శ్రీనివాస్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ నరేష్, వైద్య సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.





యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిన

# అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**

జనగాం జిల్లా యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరియు చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

జనగాం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బోనాసి క్రాంతి కుమార్, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా ఇల్లందుల విజయ్, చిల్పూర్ మండల యువజన అధ్యక్షులుగా ఇసురం రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పొట్లపల్లి శ్రీధర్ రావు గెలిచిన అభ్యర్థులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నాయకత్వ బాధ్యతలు తీసుకున్న యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రజల కోసం కృషి చేయాలని, పార్టీ పటిష్ఠానికి తోడ్పడాలని కోరారు.



ప్రతిపక్షాల విమర్శలపై

# మంత్రి సురేఖ ఆగ్రహం

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజాప్రతినిధులపై బిఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న చౌకబారు విమర్శలను మంత్రి సురేఖ తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని, ఆ నమ్మకాన్ని తిరిగి పొందేందుకు కెటిఆర్ రకరకాల జిమ్మికులు చేస్తూ ప్రజల నుంచి ఛీత్కారాన్ని ఎదుర్కొంటున్నారని ఆమె విమర్శించారు.

**కోమటిరెడ్డి బ్రదర్స్‌పై స్థాయి లేని వ్యాఖ్యలు**

బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమైనవని,ఆయనకు కోమటిరెడ్డి వెంకట రెడ్డిని విమర్శించే స్థాయి లేదని అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ నల్గొండ ప్రజల ఆదరాభిమానాలకు పాత్రులని, వారి రాజకీయ జీవితం త్యాగాలతో నిండినదని గుర్తుచేశారు.

**బిఆర్ఎస్ అవినీతిపై చట్టబద్ధంగా దర్యాప్తు**

పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన అవినీతి, అక్రమాలతో నిండిపోయిందని, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టబద్ధంగా దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. నేరం నిరూపితమైన తర్వాత అవసరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విజయవంతమైన పాలన**

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రధాన ఉద్దేశంగా పనిచేస్తోందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ప్రభుత్వ విజయం చూసి ప్రతిపక్షాలు అసహనంతో ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్య విలువల రక్షణ అవసరం**

ప్రజా ప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణం అవసరమని, ఈ విషయంలో ప్రతిపక్షాలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందని స్పష్టం చేశారు.

**మాటకు మాట సమాధానం**

ప్రభుత్వాన్ని విమర్శించడంలో గద్దు వ్యాఖ్యలు చేసే ప్రతిపక్షాలకు తగిన సమాధానం ఇస్తామని మంత్రి సురేఖ హెచ్చరించారు. ప్రజలు బిఆర్ఎస్, బీజేపీ కుట్రల గురించి జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఐదేళ్లపాటు అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని మంత్రి సురేఖ ధీమా వ్యక్తం చేశారు.



తెలంగాణలో జాతీయ

# రహదారుల నిర్మాణ వ్యయం, వివరాలేంటి..?

- **లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి**
- **లిఖితపూర్వక సమాధానమిచ్చిన కేంద్రమంత్రి గడ్కరీ**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న.. జాతీయ రహదారుల ప్రస్తుత నిర్మాణ పరిస్థితి ఏంటని.. కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధుల వివరాలు ఏంటి..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభ లో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. గురువారం ఈ మేరకు మాట్లాడగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రివర్యులు నితిన్ గడ్కరీ సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా అవసరాల మేరకు.. పూర్తి స్థాయిలో రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధుల సహకారం తో పాటు కేంద్ర ప్రభుత్వం.. 202425 సంవత్సరము వరకు రూ. 4, 494కోట్లతో తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రుద్రంపూర్ భద్రాచలం సెక్షన్ పనులు, ఇంకా వివిధ ప్రాంతాల్లో.. హైదరాబాద్ భూపాలపట్టణం రహదారి పనులు, మహబూబ్ నగర్ చించోలి రహదారి విస్తరణ పనులు.. తిరుమలగిరి సూర్యాపేట రోడ్డు విస్తరణ ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అన్నీ..సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# "మహాలక్ష్మి"తో ప్రభుత్వం మహిళలను ఆదుకుంటోంది

- డిప్యూటీ మేయర్ శ్రీమతి ఫాతిమా జోహార
- ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం నిరాటంకంగా కొనసాగడం మహిళల పట్ల ప్రభుత్వానికున్న గౌరవం
- ఉమ్మడి ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం... గత సంవత్సర కాలంగా నిరాటంకంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని కొనసాగించడం ప్రభుత్వం మహిళలను ఆదుకోవడమేనని ఖమ్మం డిప్యూటీ మేయర్ శ్రీమతి ఫాతిమా జోహార అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం కొత్త బస్టాండ్ నందు గురువారం ఏర్పాటు చేసిన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం పట్టణ డిప్యూటీ మేయర్ శ్రీమతి ఫాతిమా జోహార పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో మహిళలందరికీ ఆధార్ గుర్తింపుతో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణం నిరాటంకంగా కొనసాగడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ సరి రామ్ మాట్లాడుతూ... ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం నిరాటంకంగా కొనసాగడం మహిళల పట్ల ప్రభుత్వానికున్న గౌరవం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 114.34కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకొని 3856.40 కోట్ల రూపాయలు ఆదా చేశారన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 4.28 కోట్ల మంది మహిళలు ప్రయాణించి 208 కోట్ల రూపాయలు ఆదా చేశారన్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ఏడాది కాలంలో 1389 కొత్త బస్సులను తీసుకురావడం జరిగిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కోసం ప్రత్యేకంగా 822 నూతన బస్సులను ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. అన్ని బస్ స్టేషన్ లో ఉచిత టాయిలెట్ల సదుపాయం, మహిళల కోసం టాయిలెట్ బాక్స్, అదనంగా కుర్చీలు, ఫ్యాన్లు, వాటర్ కూలర్స్ ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రయాణికులు మాట్లాడుతూ... మహిళలకు ఉచిత ప్రయాణం తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని దీని ద్వారా కొంత డబ్బును ఆదా చేసుకోగలుగుతున్నామని, ఉచిత ప్రయాణాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మహిళలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో మేనేజర్ దినేష్ కుమార్, మధిర డిపో మేనేజర్ శంకర్ రావు, పర్సనల్ మేనేజర్ జివిస్ నారాయణ, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, మెడికల్ ఆఫీసర్ సాయిసుష్మ, అసిస్టెంట్ మేనేజర్లు, రామయ్య, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, విజిలెన్స్, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నవాబ్ నవాజ్ దమ్ బిర్యాని ప్రారంభించిన ఖమ్మం మాజీ ఎమ్మెల్యే యూనిస్ సుల్తాన్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

స్థానిక సరిత క్లినిక్ సెంటర్లోని నవాజ్ నవాబ్ దమ్ బిర్యాని గురువారం నాడు ఖమ్మం మాజీ ఎమ్మెల్యే యూనిస్ సుల్తాన్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది ఈ ప్రారంభానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేందర్, ఎండి హుస్సేన్ ఖమ్మం జిల్లా యూత్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్లపల్లి సంతోష్ మరియు సుల్తాన్ కుమారుడు ఆఫ్టర్ నూన్ సుల్తాన్ పాల్గొన్నారు నవాజ్ నవాబ్ దమ్ బిర్యాని యాజమాన్యులు పోయింది సయ్యద్ యాకూబలి ఎన్ ఎస్ సి ఐ జిల్లా నాయకులు సయ్యద్ ఆసిఫ్ అలీ సయ్యద్ ఆఫ్రిద్ అలీ పాల్గొన్నారు ఈ సందర్భంగా యూనిట్ సుల్తాన్ మాట్లాడుతూ నవాజ్ నవాబ్ దమ్ బిర్యాని రోజురోజుకీ అభివృద్ధి చెందాలని బిర్యానీ విషయంలో మంచి క్వాలిటీ మైంటైన్ చేసి ప్రజల మెప్పు పొందలి అని దినదినం అభివృద్ధి ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఈ నాయకులు కాసి మల్ల హరి నల్లపు కార్తీక్ కంచర్ల వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## ఆదర్శ కమ్యూనిస్టు పోటు ప్రసాద్

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు-బాగం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

అమరజీవి పోటు ప్రసాద్ ఎంతో ఆదర్శవంతమైన కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు హేమంతరావు అన్నారు గురువారం చింతకాని మండలం బస్వాపురం గ్రామంలో జరిగిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చరిత్ర గల కుటుంబంలో పుట్టిన పోటు ప్రసాద్ ఖమ్మం జిల్లాకు వచ్చి విద్యార్థి నాయకుడిగా, యువజన నాయకుడిగా, కార్మిక నేతగా ఎదిగి సిపిఐ జిల్లా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించాలని కొనియాడారు .వారి యావత్ కుటుంబం కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు ఈనెల 8న ఖమ్మంలో జరగనున్న పోటు ప్రసాద్ సంస్మరణ సభలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగిడిపల్లి ఏసు ,జిల్లా సమితి సభ్యులు మార్గం శ్రీను, శాఖ కార్యదర్శి బద్దల నరసింహారావు , నాయకులు బుర్ర అంజయ్య ఆవుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు







# పారిశ్రామికంగా బుగ్గపాడు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు..

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు
- మహిళలను కోటీశ్వరులు చేసేందుకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం
- రైతుల ఆదాయం పెరిగేలా ఆహారశుద్ధి పరిశ్రమలను స్థాపించాలి
- సత్తుపల్లి మండలం బుగ్గపాడు ఫుడ్ పార్కును ప్రారంభించిన మంత్రులు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

పారిశ్రామికంగా బుగ్గపాడు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

గురువారం సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, టి.జి.ఐ.ఐ.సి. చైర్మన్ టి. నిర్మల జగ్గా రెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులతో కలిసి పాల్గొన్నారు. సభాస్థలి వద్ద తెలంగాణ నూనె గింజల ఉత్పత్తిదారులు సహకార సమాఖ్య లిమిటెడ్, తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు వారు ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్ లను మంత్రులు, ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం సభాస్థలిపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా చైతన్య వంతమైన జిల్లా అని, రాజకీయంగా, విద్యా పరంగా ముందు ఉన్న జిల్లా ఖమ్మం జిల్లా అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు సత్తుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించారని, అదేవిధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హయంలో ఇక్కడ రోడ్లు, కాలువలు వంటి అనేక అభివృద్ధి పనులు చేశారని అన్నారు. బుగ్గపాడు గ్రామంలో మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు కోసం ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో భూమిని కేటాయించడం జరిగిందని, గత పాలకులు ఈ ఫుడ్ పార్క్ పై నిర్లక్ష్యం వహించగా, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మౌళిక వసతుల పనులలో వేగం పెంచి నేడు ప్రారంభిస్తున్నామని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి తుమ్మల ప్రతి రోజు ఈ ఫుడ్ పార్క్ ను ప్రస్తావిస్తూ, ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను సంప్రదించి ఫుడ్ పార్క్ లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిప్యూటీ ముఖ్యమంత్రి , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన లేకపోయారని మంత్రి తెలిపారు. ఐటి రంగం, ఉపాధి కల్పన జరగాలని, స్థానిక నిరుద్యోగ యువతకు బంగారు భవిష్యత్తు కల్పించాలని ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దామని, నేడు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమానికి నాంది పలికామని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలతో చిన్న, సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన శిక్షణ అందిస్తామని అన్నారు. మహిళలు ఏర్పాటు చేసే పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో నూతనంగా రూపొందించిన ఎం.ఎస్.ఎం.ఈ. పాలసీ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలకు ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సత్తుపల్లిలో మహిళలతో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని, త్వరలోనే అక్కడ మౌళిక వసతులు కల్పిస్తామని మంత్రి కలెక్టర్ కు సూచించారు. ఖమ్మంలో గ్రానైట్, రైస్ మిల్లర్లు, జిన్నింగ్ మిల్లు, మొదలగు 2300 పైగా పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో 10 వేల ఎం.ఎస్.ఎం.ఈ. పరిశ్రమలు ఏర్పాటు కావాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని మంత్రి తుమ్మల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఖమ్మం జిల్లాలో అందుబాటులో ఉన్న రా మేటిరియల్ వాల్యూ అడిషన్ చేస్తూ శాస్త్రీయ బద్దంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఆహ్వానం పలుకుతామని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలకు సబ్సిడీలు అందిస్తూ స్థానిక యువతకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాలలో వాటా కల్పించింది ప్రజా ప్రభుత్వం మాత్రమేనని, ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఫుడ్ పార్క్ లో అధిక పరిశ్రమలు తీసుకుని వచ్చి ఈ ప్రాంత రైతులు పండించే జామ, కొబ్బరి కాయ, ఆయిల్ పామ్, మొదలగు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు. బుగ్గ పాడు మెగా ఫుడ్ పార్క్ లో మొత్తం 200 ఎకరాలకు పైగా అందుబాటులో ఉందని, దీనిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొని రావాలని అన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమల ద్వారా రైతుల ఆదాయం పెరగాలని, అటువంటి పరిశ్రమలు టి.జి.ఐ.ఐ.సి. అధికారులు తీసుకోని రావాలని అన్నారు. గతంలో వైయస్సార్ హయాంలో శంకుస్థాపన చేసిన ఫుడ్ పార్క్ ను నాబార్డు నుంచి నిధులు తీసుకుని వచ్చి అవసరమైన వసతులు కల్పించామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఫుడ్ పార్క్ పరిధిలో లక్ష ఎకరాల వరకు భూమి ఉందని, ఇక్కడ పండించే పంటలు ఆహార శుద్ధి పరిశ్రమకు ఉపయోగపడతాయని అన్నారు. మంత్రి తుమ్మల మార్గదర్శకంలో జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని, ఖమ్మం జిల్లాలో 9 వేల ఎకరాలలో ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగు పంట సాగు జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరం 6 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరించే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు. అదే విధంగా రెండు వేల ఎకరాలలో పండ్లు, కూరగాయల పంట పెరిగే దిశగా పని చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో బుగ్గపాడు గ్రామంలో మెగా ఫుడ్ పార్క్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో జలగం వెంగళరావు, తుమ్మల నాగేశ్వర్ రావు, జలగం వెంకట్ రావు వంటి మహనీయులు ప్రతినిధులు వహించిన స్థానం నుంచి మహిళగా తాను ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉందని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ప్రజల మేలు కోరుతూ అనేక కార్యక్రమాలను సంవత్సర కాలంలో అమలు చేశామని అన్నారు. 2008లో 200 ఎకరాలు సేకరించి ఫుడ్ పార్క్ కోసం శంకుస్థాపన చేసినప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా ప్రారంభానికి నోచుకోలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి తుమ్మల చొరవతో, ఐటి పరిశ్రమ శాఖ మంత్రి కృషి వల్ల పరిశ్రమలు వచ్చి నేడు ఫుడ్ పార్క్ ప్రారంభిస్తున్నామని అన్నారు. సత్తుపల్లి లో సింగరేణికి సంబంధించిన నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉందని ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, బొగ్గు ఆధారిత చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు వడ్డీ లేని రుణాల పథకాన్ని పునరుద్ధరించామని అన్నారు. మహిళలు ఆహార శుద్ధి రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తే వారికి రుణాలు అందించడంతో పాటు సబ్సిడీ కూడా ప్రభుత్వం అందిస్తుందని, దీనిని మహిళలు ఉపయోగించుకోవాలని అన్నారు. పొలాల వైపు వెళ్లే మార్గాల్లో రోడ్లు వేయాలని, బేతుపల్లి కాలువ, లంక సాగర్ ప్రాజెక్టు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టి.జి.ఐ.ఐ.సి మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీ అమలు చేస్తుందని, వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక చొరువతో బుగ్గ పాడు మెగా ఫుడ్ పార్క్ లో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేశామని అన్నారు. బుగ్గ పాడు లో ఉన్న సౌకర్యాలు హైదరాబాద్ ఇండస్ట్రియల్ పార్కుల లో కూడా లేవని, ప్రపంచ స్థాయి సదుపాయాలు ఉన్న ఈ ఫుడ్ పార్క్ లో మరిన్ని పరిశ్రమలు స్థాపించేలా కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఫుడ్ పార్క్ లో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామిక వేత్తలతో ఒప్పందాలు చేస్తూ భూ కేటాయింపులు జరిపారు. 50 కోట్లతో 10 ఎకరాలలో అక్వా ప్రాసెసింగ్ యూనిట్ ను సన్ బైట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, ఎకరంలో లక్ష్మీ నారాయణ ట్రేడర్స్ ద్వారా సిరియల్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. సుప్రీమ్ ప్రొడక్ట్స్, మోనాల్ గ్రాండ్ మార్ట్స్, సర్వ రాయల్ షుగర్స్ & సి.హెచ్ వెంకటేశ్వర ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, టి.జి.ఐ.ఐ.సి ఈ.డి పవన్ కుమార్, కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి రాజేంద్ర గౌడ్, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ సీతారాములు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన అభిమానులకు 50 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలి

- ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా నాయకులు షేక్ హిమామ్ డిమాండ్.

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



సినీ నటుడు అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా చూడటానికి వచ్చి మరణించిన అభిమానులకు అల్లు అర్జున్ ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలి అని ఖమ్మం జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ హిమామ్ అన్నారు. గురువారం పత్రిక ప్రకటన ద్వారా ఖమ్మం జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ హిమామ్ మాట్లాడుతూ గురువారం ప్రముఖ అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ సినిమా విడుదల అయింది సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ హైదరాబాదులో ఆర్టీసీ క్రాస్ రోడ్ సంధ్య థియేటర్లో పుష్ప 2 సినిమాని చూడటానికి అల్లు అర్జున్ వచ్చారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ చూడటానికి అభిమానులు చాలామంది సినిమా థియేటర్ దగ్గరికి వచ్చారు ఆ తొక్కిసలాటలో ఒక అభిమాని చనిపోవడం జరిగింది. ఇంకో థియేటర్ దగ్గర కూడా ఒక మహిళా చనిపోవడం జరిగింది. ఒక అగ్ర కథానాయకుడు తన సినిమా చూసుకోవడం కోసం వచ్చేటప్పుడు పోలీసుల బందోబస్తు తోటి అక్కడ తొక్కిసలాట జరగకుండా చూసుకొని రావలసిన బాధ్యత ఆ హీరో పై ఉన్నది అవేమీ చూసుకోకుండా ఒక సామాన్యుడిలాగా ఏమి ఆలోచించకుండా అభిమానుల తోక్కిసాలాట కారణమైన అల్లు అర్జున్ పై కేసు నమోదు చేసి చనిపోయిన వారికి ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు ఇచ్చి వారి కుటుంబాలు ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ హీరో అయినా ఇలాంటి చర్యలకు పాల్పడకుండా అభిమానుల ప్రాణాలు తీయకుండా చూడాలని పోలీసులు కూడా అనుమతులు ఇవ్వకుండా ఉండాలని ఒకవేళ అనుమతులు ఇచ్చిన తగిన బందోబస్తు ఏర్పాటు చేసి అక్కడికి నటుల్ని ఆహ్వానించాలని ఆయన కోరారు. అంతేకాకుండా పెద్ద సినిమాల విడుదల సందర్భంగా సినిమా టికెట్లు ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారు. సినిమాలు వందల కోట్ల బడ్జెట్ తో తీసి ఆ డబ్బులు అభిమానుల దగ్గర గుంజటం కోసం టికెట్ల రేట్లు విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారు 150 రూపాయలు ఉన్న టికెట్ని 500, 600 ,700 పెంచుకుంటా పోతావున్నారు. ఇలా అభిమానుల దగ్గర టికెట్ల రూపంలో దోచుకుంటా ఉన్నారు నిర్మాతలు సినిమా టికెట్లు ఎప్పుడు కూడా ఒకే విధంగా ఉండాలని ఆయన కోరారు.



## ఈనెల 8 న ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఓహో.. మేఘ మాలా సినీ సంగీత విభావరి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

భక్తరామదాసు కళాక్షేత్రం లో ఈనెల 8 ఆదివారం సాయంత్రం 4:30 ల నుండి... 5.15 వరకు చిన్నారి "వినూత్న & వి.లాస్య" లచే సినీ, పాటల నృత్యప్రదర్శన ఉంటుందని . ఆ తర్వాత సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు స్వర సుధ" మ్యూజిక్ యూనిట్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో అమర గాయకులు పద్మ శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా ఘంటసాల పాటల పండుగ ఓహో.. మేఘ మాలా... "అర్ధశత గాన స్వరార్చన" ను ప్రముఖ గాయనీ గాయకులచే సినీ సంగీత విభావరి ఘనంగా నిర్వహిస్తున్నామని అధ్యక్షులు కొమర్రాజు మాధవరావు తెలిపారు . సన్మాన గ్రహీతులు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డా" నాగబత్తిని రవి , రంగస్థల కళాకారులు సినీ నటుడు హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎండి జమా . పై సన్మాన కార్యక్రమంలో భాగంగా రంగస్థలం కళాకారులు శ్రీ పొదిల వెంకటేశ్వర్లు చే వారి సతీమణి కీర్తిశేషులు పొదిల వెంకటమ్మ జ్ఞాపకార్ధకంగా 27 మంది కళాకారులకు మెడల్స్ & షీల్డ్స్ తో సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు . ఈ కార్యక్రమంలో ముఖ్యసలహాదారులు "సుజనహిత " శ్రీమతి డా" వనం కృష్ణవేణి , గౌరవ అధ్యక్షులు పారుపల్లి సురేష్ , ఉపాధ్యక్షులు వివి రెడ్డి , కోశాధికారి పి.జె.వినయ్ కుమార్ , వేదిక పర్యవేక్షలు పిన్నెల్లి యాదగిరి , ప్రోగ్రాం కన్వీనర్ కె.వి.రమణా రావులు పాల్గొన్నారు . కార్యక్రమ వ్యాఖ్యాత గా అఖండ నంది అవార్డు గ్రహీత ఖమ్మం కు చెందిన కళావాచస్పతి శ్రీ జి. రవీందర్ వహిస్తారని అలాగే ఆర్కెస్ట్రా స్వర సుధ" బృందం అని తెలిపారు .





## ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు ప్రమాదం

**తెలంగాణ ముచ్చట్లు:**

జబర్దస్త్ కమెడియన్ రామ్‌ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తుక్కుగూడ వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. షూటింగ్‌కి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఔటర్‌పై కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టింది. దీంతో ముందున్న కారును రామ్‌ప్రసాద్ కారు ఢీకొట్టింది. దీంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది.

## లక్కీ డ్రాలో రూ.1.5 కోట్లు గెలుచుకున్న హర్యానా ప్లంబర్

**తెలంగాణ ముచ్చట్లు:**





హర్యానాలోని సిర్సా జిల్లా ఖైర్‌పూర్ గ్రామానికి చెందిన ప్లంబర్‌కు లాటరీ లక్కీ డ్రాలో రూ.1.5 కోట్ల బహుమతి తగిలింది. ఇది అతనితో పాటు అతని కుటుంబానికి ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది. లక్కీ డ్రాలో అంత పెద్ద మొత్తం రావడంతో ఒక్కసారిగా అతని దశ తిరిగింది!ఖైర్‌పూర్‌కు చెందిన 40 ఏళ్ల ప్లంబర్ మంగళ్‌కు రెండు రోజుల క్రితం రాత్రి 9 గంటలకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. అతనికి ఫోన్ చేసింది లాటరీ ఏజెంట్. అతను ఐదేళ్లుగా లాటరీని కొనుగోలు చేస్తున్నాడు. కానీ ఈసారి అదృష్టం వరించింది. లాటరీలో రూ.1.5 కోట్లు గెలుచుకున్నట్లు సదరు ఏజెంట్ చెప్పాడు. అయితే అతను చెప్పిన దానిని తొలుత మంగళ్ నమ్మలేక పోయాడు. ఆ తర్వాత నిజమేనని తెలిసి ఎంతో ఆనందించాడు. ఆ రాత్రి అతని కుటుంబ సభ్యులు నిద్ర కూడా పోలేనంత సంతోషంలో మునిగితేలారు.ఆ తర్వాత ఈ సంతోషాన్ని ఇరుగుపొరుగుకు చెప్పి... మిఠాయిలు పంచారు. లాటరీలో వచ్చిన డబ్బుతో కొంత మొత్తంతో ఇల్లు కడతానని, మిగతా మొత్తాన్ని తన కూతురు భవిష్యత్తు కోసం పొదుపు చేస్తానని తెలిపాడు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శుక్రవారం 06 –12–2024


# ఖబడ్దార్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి

- తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తో చర్చించే స్థాయి నీది కాదు
- సూరంశెట్టి కిషోర్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

గురువారం మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ మాట్లాడుతూ... శ్రీధర్ రెడ్డి నువ్వు నిజాలు తెలుసుకొని వాస్తవాలు మాట్లాడాలి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కూడా అవ్వకముందే ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో నాలుగు హామీలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందిమీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకొచ్చి 11 సంవత్సరాలయింది. మీతో పొత్తు పెట్టుకున్న బిఆర్ఎస్ పార్టీ ఐదు సంవత్సరాలు క్రితం రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదు, పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసినప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదు, నిరుద్యోగులకు నిరుద్యోగి భృతి ఇస్తానని చెప్పి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదు, కేంద్రంలో మీ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత విదేశాలలోని నల్ల డబ్బులు తీసుకువచ్చి పేద ప్రజల అకౌంట్లో డబ్బులు



వేస్తానని చెప్పి జన్ ధన్ బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి మోసం చేసింది మీరు కాదా, కేంద్రంలో బిజెపి అధికారం వచ్చిన తర్వాత గ్యాస్ ధరలను పెంచి గ్యాస్ బండను 1200 రూపాయలు చేసింది మీరు కాదా, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదలపై భారం వేసింది మీ ప్రభుత్వం కాదా, రైతులపై నల్ల చట్టాలను తీసుకువచ్చి అతని అంబానీ, అదాని లకు మేలు చేయాలని చూసింది మీరు కాదా, రైతులు తిరగబడితే ఆ నల్ల చట్టాలను రద్దు చేసుకున్నది మాట వాస్తవం కాదా, ఇటీవల రాష్ట్రాల్లో ఎన్నిక జరిగిన మూడు రోజుల్లోనే 3వంతులు రైతులకు ఉపయోగపడే మందు కట్టలపై ధరలు పెంచింది బిజెపి ప్రభుత్వం కాదా, ఈ 11 సంవత్సరాల్లో మీరు ఏం పీకారో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక సంవత్సరంలో ఏం చేసిందో చర్చకు మేము సిద్ధం తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణకు కనీస 100 రూపాయలు అయినా మీరు కేంద్రం నుంచి నిధులు తీసుకు వచ్చారా, మీ బీజేపీ పొత్తు వున్నా రాష్ట్రాలకు మీరు ఇస్తున్న నిధులు ఎంత ఇస్తున్నారు, పొత్తులేని మిగతా రాష్ట్రాలకు ఎంత నిధులు ఇస్తున్నారో మీ కేంద్ర మంత్రులను తీసుకురా.. భట్టి గారితో చర్చకు రమ్మను చర్చిద్దాం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనైనా లేక మీ బీజేపీ పార్టీ కార్యాలయంలో నైన ఎక్కడైనా సరే చర్చకు సిద్ధం... అని అన్నారు..ఈ కార్యక్రమంలో మధుర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు నిడమనూరు వంశీకృష్ణ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ పట్టణ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు షేక్ బాజీ కాంగ్రెస్ నాయకులు బోల్లెద్దు రాజేంద్ర మైలవరపు చక్రి పుట్ట పుల్లారావు మాజీ సర్పంచ్ మదార్ సాహెబ్ మొదలగు వారు పాల్గొన్నారు



## మున్సిపాలిటీల్లో ఆ పంచాయతీల విలీనం ఖాయం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న గ్రామాలను పురపాలికల్లో విలీనం చేసేందుకు మార్గం సుగమమైంది. సమీపంలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో రాష్ట్ర ప్రభుత్వం విలీనం చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు, ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం విలీనం జరిగిందని చెప్పింది. పాలనలో భాగంగా చట్టాలు తెచ్చే అధికారం అసెంబ్లీకి ఉందని పేర్కొంది. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామపంచాయతీలను ఇటీవల పురపాలికల్లో విలీనం చేశారు.పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పలు పిటిషన్లు దాఖలు కాగా ఇవాళ సీజే ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఓఆర్ఆర్ పరిధి లోపల, ఓఆర్ఆర్‌ను అనుకొని ఉన్న 51 గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 3న ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ మేరకు గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర సర్కారు శరవేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతుండటంతో పాలనా సౌలభ్యం కోసం ఆ నిర్ణయం తీసుకుంది. సర్పంచులు, పాలకవర్గం పదవి కాలం ముగియడం, ప్రత్యేక అధికారుల పాలనలో ఉండగానే 2019 పురపాలక చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.ఓఆర్ ఆర్ పరిధి మొత్తం పూర్తి పట్టణ ప్రాంతంగా : రంగారెడ్డి జిల్లా పరిధిలో 12 గ్రామాలను 4 మున్సిపాలిటీల్లో కలపగా అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 28 గ్రామాలను 7 మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలను అక్కడి రెండు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. గ్రామ పంచాయతీల విలీనంతో ఔటర్ రింగు రోడ్డు పరిధి మొత్తం పూర్తి పట్టణ ప్రాంతంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా పరిధిలోని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట శంషాబాద్ మున్సిపాలిటీలో బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘంసీమిగూడ విలీనం కాగా నార్సింగి పురపాలికలో మీర్జాగూడ గ్రామపంచాయతీ విలీనమైంది.తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడను విలీనం చేస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి, నాగారం మున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార పంచాయతీలు పోచారం పురపాలికలో వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివాని సింగారం, చౌదరిగూడను విలీనం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడల విలీనం చేశారు.
నిధులు సమకూర్చనున్న పురపాలికలు : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలను విలీనం చేశారు. తూంకుంట మున్సిపాలిటీలో బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు కలిసిపోయాయి. సంగారెడ్డి జిల్లా ఓఆర్ ఆర్ పరిధిలోని తెల్లాపూర్ పురపాలికలో కర్దనూర్, ముత్తంగి, పోచారం, పాటీ, ఘన్‌పూర్ పంచాయతీలను కలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్ గూడ, దాయర, కిష్టారెడ్డిపేట, సుల్తాన్ పూర్ పంచాయతీలను విలీనం చేశారు. ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న గ్రామాలన్నీ మున్సిపాలిటీల్లో కలవడంతో అవన్నీ పట్టణ ప్రాంతాలుగా పరిగణించబడతాయి. వాటికి కావాల్సిన నిధులు, మౌలిక సదుపాయాల కల్పనను ఆయా పురపాలికలు సమకూర్చనున్నాయి.



## జిల్లా లో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదు

- రెండు లక్షల రూపాయలు లోపు పూర్తి అనే ప్రభుత్వ ప్రకటన మోస పూరితం
- రైతు రుణమాఫీ పై నేటి నుంచి రైతు పోరు బాట
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**


జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ప్రక్రియ పూర్తి యినట్లు గా ప్రకటన చేయటం రైతులను మభ్య పెట్టేందుకు అని అన్నారు, ఖమ్మం డిసిసిబి పరిధిలో 80 వేల మందికి పైగా రైతుల రుణమాఫీ చేయకుండా పూర్తి ఎలా అవుతుంది అని అన్నారు , నవంబర్ 30 రై తు విజయోత్సవ సభ లో విడుదల చేసిన మూడు వేల కోట్ల రూపాయల్లో ఒక రూపాయి కూడా ఇంకా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదు అన్నారు. వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులు కనీసం నాలుగు విడత రుణమాఫీ జాబితాలో పేర్ల వివరాలు కూడా రైతులకు చెప్పే పరిస్థితి లేదని అన్నారు.
ఆధార్ కార్డ్ బ్యాంకు ఎకౌంటు అనుసంధానం లో జరిగిన తప్పులు, ఇంటి పేర్లు, రైతులు పేర్లు, ఆధార్ కార్డు లో ఉన్న పేరు సరిపోల్చ లేదని టెక్నికల్ సమస్యలు పేరుతో వేలాదిమంది రైతులు రుణమాఫీ చేయలేదు అన్నారు, బ్యాంకులో రుణం పొందినప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ప్రస్తుతం పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు రైతు మరణించి ఉంటే అలాంటి వారికి కూడా రుణమాఫీ వర్తించలేదని అన్నారు . రుణమాఫీలో సమస్యలకు బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారుల తప్పిదం గా ప్రభుత్వం వారిపై మోపి సమస్య నుంచి తప్పుకోవాలని చూస్తుందని అన్నారు.ప్రభుత్వం వెంటనే రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు, రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో రైతు సర్వే, ఆందోళన వారం రోజులు పాటు కొనసాగిస్తాం అన్నారు. రైతులనుంచి వివరాలు సేకరణ పూర్తి చేసి పోరాటం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది, రైతులు పోరాటం లో స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శులు చింత నిప్పు చలపతిరావు, ఎస్ కె మీరా,బిక్కసాని గంగాధర్ , వీరబాబు తదితరులు పాల్గొన్నారు



## యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ

**తెలంగాణ ముచ్చట్లు:**

యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్‌పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. ఇవాళ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్‌లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్‌ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు.తప్పులు చేస్తే ఉపేక్షించం : ఎవరూ తప్పులు చేసినా ఉపేక్షించమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నల్లో తప్పులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు. ఈ పదవిలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రిపేర్ అయ్యే సమయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కరెక్ట్‌గా పనిచేయడంతోనే తనకు ఉద్యోగం వచ్చిందని గుర్తు చేసుకున్నారు.2030 ఏప్రిల్ 4 వరకు టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా : టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం 2030 ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నారు. ఐఏఎస్‌కు బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ, గవర్నర్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా, జేఎన్‌టీయూహెచ్ వీసీగా బుర్రా వెంకటేశం రిలీవ్ అయ్యారు.

## మరో కారును ఢీకొట్టిన బీఎండబ్ల్యూ.. తుక్కైన కోట్ల విలువైన లగ్జరీ కారు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

లగ్జరీ కారైన బీఎమ్‌డబ్ల్యూ, టాటా పంచ్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత డివైడర్‌లోకి అది దూసుకెళ్లింది. ఈ సంఘటనలో కోటికిపైగా విలువైన ఆ కారు ముందు భాగం తుక్కుతుక్కైంది. అయితే డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడుదేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఢిల్లీ గేట్ వద్ద వేగంగా వెళ్తున్న లగ్జరీ బీఎమ్‌డబ్ల్యూ కారు మరో కారైన టాటా పంచ్‌ను ఢీకొట్టింది. దానిని వంద మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లగ్జరీ బీఎమ్‌డబ్ల్యూ కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.కాగా, ముగ్గురు ప్రయాణిస్తున్న తమ కారును హైస్పీడ్ స్పోర్ట్స్ కారు ఢీకొట్టినట్లు మరో కారు డ్రైవర్ రాహుల్ తెలిపాడు. ఆ తర్వాత అది బ్యాలెన్స్ కోల్పోయి డివైడర్‌లోకి దూసుకెళ్లిందని చెప్పాడు. ఈ సంఘటనలో తమ కారు దెబ్బ తిన్నదని, అయితే తమకు ఏమీ కాలేదని వివరించాడు.మరోవైపు ఈ ప్రమాదం గురించి తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు భాగం తుక్కైన బీఎమ్‌డబ్ల్యూ కారును క్రేన్ సాయంతో అక్కడి నుంచి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## రేవతి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**


హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జావిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సంధ్య థియేటర్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వారిని పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కంచన్‌బాగ్ ఠాణాకు తరలించారు. అంతకుముందు జావిద్ మాట్లాడుతూ.. సినిమా టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోల నిర్వహణకు విడుదలచేసిన ప్రత్యేక జీవోలను రద్దు చేయాలని కోరారు. అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకోవాలి ఆప్: రేవతి కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న ఆమె తనయుడు శ్రీతేజకు మెరుగైన వైద్యం అందించాలని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.సుధాకర్ డిమాండ్ చేశారు. థియేటర్ యాజమాన్యం, పోలీసులపైనా కేసులు నమోదు చేయాలన్నారు. హీరో అల్లు అర్జున్‌పైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ చిక్కడపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు.`య పుష్ప 2 బెనిఫిట్ షో వేళ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంధ్య థియేటర్ యాజమాన్యంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎల్ ప్రదీప్ డిమాండ్ చేశారు. నల్లకుంట: పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాటకు కారణమైన అల్లు అర్జున్‌ను అరెస్టు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



## ఎంపీ ధర్మపురి అరవింద్‌కు బిగ్ షాక్..

**తెలంగాణ ముచ్చట్లు, నిజామాబాద్:**

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ 2022లో చంచల్‌గూడ జైలు వద్ద ఎస్సీ, ఎస్టీలను కించపరిచేలా వ్యాఖ్యానించారంటూ ఆయనపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో బంగారు సాయిలు అనే వ్యక్తి అరవింద్‌పై పోలీసు కేసు కూడా పెట్టారు. నిజామాబాద్‌లో ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని మాదన్నపేట పోలీస్ స్టేషన్‌కు ఈ కేసు బదిలీ అయ్యింది.
ఈ నేపథ్యంలోనే తనపై నమోదైన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ధర్మపురి అరవింద్ హైకోర్టును ఆశ్రయించారు. ఎస్సీ, ఎస్టీలను కించపరచలేదని.. నిరాధార ఆరోపణలతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరారు. అయితే అరవింద్‌కు న్యాయస్థానంలో బిగ్ షాక్ తగిలింది. బుధవారం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. దాన్ని కొట్టివేసింది. కేసు విచారణను ఎదుర్కోవాల్సిందేనని.. కింది కోర్టుతో తేల్చుకోవాలని జస్టిస్ కె.లక్ష్మణ్ తెలిపారు. కింది కోర్టులో ఈ వ్యవహారాన్ని తేల్చుకోవాలంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
ఇదిలాఉండగా.. నిజామాబాద్ నుంచి బీజేపీ ఎంపీగా ధర్మపురి అరవింద్ రెండోసారి గెలిచిన సంగతి తెలిసిందే. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీ చేయగా.. ఓడిపోయారు. చివరికి మరోసారి నిజామాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన ఆయన రెండోసారి గెలిచారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి దక్కించుకునేందుకు ధర్మపురి అరవింద్ కూడా బీజేపీ పెద్దలతో మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



## టాప్100 నగరాల్లో భారత్ నుంచి ఒకే ఒక్క సిటీ

**తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన వంద నగరాల జాబితా2024లో భారత్ నుంచి ఒకే ఒక్క నగరానికి చోటు దక్కింది. ఇక ఎప్పటిలానే వరుసగా నాలుగో ఏడాది కూడా ఫ్యాషన్ రాజధాని పారిస్ 17 మిలియన్లకుపైగా ఇన్‌బౌండ్ అరైవల్స్‌తో టాప్ ప్లేస్‌లో నిలిచింది. డాటా అనలిటిక్స్ కంపెనీ యూరోమోనిటర్ ఇంటర్నేషనల్ విడుదల చేసిన తాజా జాబితాలో మాడ్రిడ్, టోక్యో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో ఇండియా నుంచి చోటు దక్కించుకున్న ఢిల్లీ 74వ స్థానంలో నిలిచింది.



## ఉప్పు ఎక్కువగా తీసుకుంటే ఏం జరుగుతుంది?

**తెలంగాణ ముచ్చట్లు:**

ఏదైనా కూరలు రుచిగా ఉండాలంటే ఉప్పు తప్పనిసరి. అలాగని ఉప్పు మితిమీరి తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు. సాధారణంగా, ఉప్పు ఎక్కువగా తింటే అధిక రక్తపోటు (హై బీపీ) వస్తుందని చెబుతారు. కాగా, పరిశోధకులు తాజాగా ఆసక్తికర అంశం వెల్లడించారు. అధిక ఉప్పు వాడకం వల్ల ఉదరకోశ క్యాన్సర్ వస్తుందట. ఉదరకోశ క్యాన్సర్ కు, ఉప్పుకు సంబంధం ఉందని పరిశోధనల్లో తెలిసింది.

శుక్రవారం 06–12–2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# కౌశిక్‌రెడ్డి అరెస్టు.. ఉద్రిక్తత

- బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించిన కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అడ్డుకునేందుకు భారాస శ్రేణుల యత్నం
- వేర్వేరు ఠాణాలకు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల తరలింపు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ న్యూస్‌టుడే: నాటకీయ పరిణామాలు, వాదోపవాదాలు, తీవ్ర ఉద్రిక్తత మధ్య భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని గురువారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్‌తో దురుసు ప్రవర్తన, విధులను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడిన కేసులో అరెస్టు చేసి.. బంజారాహిల్స్ ఠాణాకు తరలించారు. ఆయన కారును సీజ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, భారాస ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. ఆయన అరెస్టును అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద హైడ్రామా**

సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ విభాగం డీజీ శివధర్‌రెడ్డిలు తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, వారిపై కేసు నమోదు చేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు బుధవారం బంజారాహిల్స్ ఠాణాకు వచ్చారు. ఆ సమయంలో విధుల్లో భాగంగా బయటకు వెళ్తున్న తన పట్ల కౌశిక్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించారని, తన వాహనాన్ని అడ్డుకుని తిరిగి ఠాణాలోకి వెళ్లేలా చేశారంటూ బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 57, 126(2), 127(2), 132, 224, 333, 351(3), 191(2), రెడ్‌విత్ 190, రెడ్‌విత్ 3(5) తదితర 10 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులోనే కౌశిక్‌రెడ్డిని



అరెస్టు చేసేందుకు కొండాపూర్ కొల్లా లగ్జేరియాలోని ఆయన నివాసానికి ఉదయం 8.30 గంటల సమయంలో పోలీసులు వచ్చారు. గేటెడ్ కమ్యూనిటీ లోపలికి ఇతరులెవరూ వెళ్లకుండా ప్రధాన ద్వారాన్ని మూసేశారు. పోలీసులు వచ్చిన సమయంలో కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు రాకపోవడం, సహకరించకపోవడంతో దాదాపు గంటకుపైగా హైడ్రామా నడిచింది. వారితో కొద్దిసేపు మాట్లాడిన ఆయన ఓ గదిలోకి వెళ్లి తలుపు గడి పెట్టుకున్నారు. తనను అరెస్టు చేసి ఇబ్బందిపెడితే ఆత్మహత్య చేసుకుంటానని ఆయన బెదిరించారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత నచ్చజెప్పడంతో గదిలో నుంచి బయటకు వచ్చారు. 10.45 గంటల సమయంలో పోలీసులు ఆయనను బంజారాహిల్స్ స్టేషన్‌కు తరలించారు. కౌశిక్‌రెడ్డిపై గతంలో రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులపై పోలీసులు గురువారం ఆరా తీయగా.. 31 ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 13 కేసులు ఈ ఏడాదే నమోదయ్యాయి.

**పోలీసుల్ని ప్రశ్నించిన హరీశ్.. గేటు దూకిన శంభీపూర్**

అంతకుముందు కౌశిక్‌రెడ్డి ఇంటికి పోలీసులు వచ్చారనే సమాచారంతో 9.30 గంటలకు మాజీ మంత్రి హరీశ్‌రావు కొల్లా లగ్జేరియాకు వచ్చారు. పోలీసులు అనుమతించకపోవడంతో గేటు వద్ద కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. భారాస నేతల్ని పోలీసులు అదుపు చేస్తున్న సమయంలో హరీశ్ తన వాహనాన్ని వేగంగా లోపల ఉండే కౌశిక్‌రెడ్డి నివాసానికి తీసుకెళ్లారు. అరెస్టు గురించి పోలీసుల్ని ప్రశ్నించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, స్థానిక నాయకులు రాగా.. వారిని కమ్యూనిటీ గేటు దగ్గరే పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగారు. శంభీపూర్ రాజు గేటు దూకి లోపలికి వెళ్లారు. జగదీశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావును పోలీసు వాహనంలో తరలిస్తుండగా భారాస నేతలు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. వాహనం తాళాలు లాక్కునేందుకు శంభీపూర్ రాజు యత్నించారు. ఉద్రిక్తత, నిరసనల మధ్య హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనను విడుదల చేయాలంటూ భారాస నాయకులు, కార్యకర్తలు పలు దఫాలుగా స్టేషన్ ఎదుట బైఠాయించారు. దాదాపు 80 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వేర్వేరు ఠాణాలకు తరలించారు. గచ్చిబౌలి ఠాణాలో ఉన్న హరీశ్‌రావును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, గోపీనాథ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, మాజీ ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి రాత్రి 7.30 సమయంలో గచ్చిబౌలి స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి తరలించారు. రాత్రి 8.30 గంటలకు హరీశ్‌రావును పోలీసులు వదిలేశారు. అనంతరం అర్ధరాత్రి కౌశిక్‌రెడ్డిని విచారణ నిమిత్తం కొత్తపేటలోని జడ్జి నివాసానికి తరలించారు. వాదనలు విన్న జడ్జి రెండు ష్యూరిటీలతో కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరుచేశారు.

# ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు వస్తుంది

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు వస్తుందని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి గచ్చిబౌలి పీఎస్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె గచ్చిబౌలి స్టేషన్‌కు చేరుకొని బీఆర్ఎస్ నేతలను కలిశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పాడి కౌశిక్ రెడ్డి ఏసీపీకి ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకొని బంజారాహిల్స్ స్టేషన్‌కు వెళ్లారన్నారు. అక్కడ ఏసీపీ లేకపోవడంతో సీఐని ఫిర్యాదు తీసుకోవాలని పాడి కౌశిక్‌రెడ్డి కోరారన్నారు. సీఐని ప్రశ్నించినందుకు కౌశిక్ రెడ్డిపై కేసులు పెట్టారంటూ మండిపడ్డారు. ఉదయం 10 గంటలకు అరెస్టు చేస్తే ఇప్పటి వరకు రిమాండ్ చేయలేదని ఆరోపించారు. పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లినందుకు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు ఇతర నేతలను అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. ఫిర్యాదు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజు వస్తుందని.. పాడి కౌశిక్‌రెడ్డిపై కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలను కోర్టు మూసిన తర్వాత పంపించాలనే జాప్యం చేస్తున్నారని.. ఇందిరమ్మ రాజ్యం కాదని.. పోలీసుల రాజ్యం నడుస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎమర్జెన్సీని తలపిస్తుందని.. అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలన్నారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు



# కాళేశ్వరం లేకున్నా ధాన్యం దిగుబడిలో రికార్డు

- ప్రాజెక్టుల కింద పెరిగిన ఆయకట్టు
- కృష్ణా, గోదావరి జలాల వాటాలపై పంతం
- ప్రాధాన్య క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేసే లక్ష్యం
- ఏడాది ప్రజాపాలనలో సాగుకు మహర్దశ

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్**



కాంగ్రెస్ ఏడాది పాలనలో సాగుకు మహర్దశ వచ్చింది. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం.. వ్యవసాయ ప్రాధాన్యతకు అనుగుణంగా తొలి ఏడాదిలోనే సాగునీటి రంగంలో కీలక మార్పులు తీసుకొచ్చి వ్యవసాయాన్ని పండుగ చేసింది. కృష్ణా జలాల పంపిణీలో న్యాయంగా రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టిన ప్రభుత్వం తమ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి వ్యూహాత్మకంగా ముందుకువెళ్తోంది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లు, విధ్వంసకర పరిస్థితులపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇందులో గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కుంగిపోయిన తీరుపై అసెంబ్లీలోనే చర్చకు పెట్టారు. నీటిపారుదల రంగంలో పదేండ్లలో పెట్టిన ఖర్చులు, తెచ్చిన అప్పులు, ఆయకట్టు తీరుతెన్నులపై శాసనసభలో చర్చించిన సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలపై విచారణకు జ్యుడిషియల్ కమిషన్‌ను నియమించింది.

**పెండింగ్ ప్రాజెక్టులపై ఫోకస్..!**

గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రాధాన్యమిచ్చిన సర్కార్.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపైనే దృష్టికేంద్రీకరించింది. ఇందులో భాగంగా నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజీ 2, సదర్మట్ ప్రాజెక్టులపై ఫోకస్ చేసింది. రూ.241 కోట్ల ఖర్చుతో దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా పనులు ప్రారంభించింది. 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది. రెండో ప్రాధాన్యతగా గోదావరి బేసిన్‌లో ఉన్న చిన్న కాళేశ్వరం, మోదికుంట, లోయర్ పెన్‌గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టు, కృష్ణా బేసిన్ లో కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ పనులు ఈ జాబితాలో చేర్చింది. ఏడు జిల్లాలను సస్యశ్యామలం చేసే దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టుకు అవసరమైన 2,947 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి.. 89,312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించే చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వం మొట్టమొదటగా కొబ్బరికాయ కొట్టి అసంపూర్తిగా వదిలేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఆర్థిక సాయం అందించాలని అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రధానిమంత్రి కృషి సించాయి యోజన పథకంలో ఈ ప్రాజెక్టును చేర్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు. గత ప్రభుత్వం రూ.7400 కోట్లు ఖర్చు పెట్టి.. ఒక్క ఎకరం కూడా నీళ్లు ఇవ్వకుండా వదిలేసిన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఆగస్ట్ 15న ప్రారంభించిన విషయం తెలిసిందే. రూ. 482.87 కోట్లతో కేవలం ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసింది. 9 కిలోమీటర్ల రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సీతారామ నీటిని నాగార్జునసాగర్ కెనాల్‌కు అనుసంధానం చేసి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించి రికార్డు సృష్టించింది. గత ప్రభుత్వం విస్మరించిన ఉమ్మడి నల్గొండ జిల్లాకు సాగునీటితో పాటు ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పనులను తిరిగి ప్రారంభించిన ప్రజా ప్రభుత్వం...సాంకేతిక నిపుణులతో కమిటీ వేసి అత్యాధునిక యంత్ర పరికరాలను విదేశాల నుంచి తెప్పించింది. సెప్టెంబర్, 2027లోపు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో రూ.4,658 కోట్లు కేటాయించింది. 2014కు పూర్వం ప్రతిపాదించిన నారాయణపేట్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన చేసిన సర్కార్.. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పాటు మక్తల్, నారాయణపేట్ అసెంబ్లీ సెగ్మెంట్లలో లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టుకు రూ.4350 కోట్లు కేటాయించింది. అలాగే సీతమ్మ సాగర్ ప్రాజెక్టుతో పాటు సీతారామ లిఫ్ట్, సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను తెచ్చుకునేందుకు కేంద్రంతో, మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

**కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో సాగు..!**

**కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం పెరిగిందని గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం... నేషనల్ డ్యాం సేఫ్టీ ఆథారిటి (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు ఈ ఏడాది మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో చుక్క నీటిని నిల్వ చేయలేదు. దీంతో కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క నీళ్లు లిఫ్ట్ చేయకుండానే ఈ ఏడాది కాళేశ్వరమేతర సాగునీటి ప్రాజెక్టుల కింద రికార్డు స్థాయిలో పంటలు సాగు చేసింది. ఈ వానాకాలంలో 67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా,153లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగడంతో రాష్ట్ర చరిత్రలో రికార్డును కైవసం చేసుకున్నది. యాసంగిలోనూ 42.11లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం ఇటీవలే సాగునీటి ప్రణాళికను విడుదల చేయటం గమనార్హం.**

**నీటి వాటా కోసం పట్టు..!**

**సాగుకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన ప్రజా ప్రభుత్వం.. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవడం ద్వారా ఈ నీటిని వినియోగించేలా చేపట్టిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది. నీటి వాటాలు, గోదావరి కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారం చేపట్టినప్పటి నుంచీ పట్టుదలతో అడుగులేస్తోంది. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా.. ఏపీలో కేవలం 30 శాతం ఉంది. అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం కృష్ణా జలాల్లోని 1005 టీఎంసీల్లో 70 శాతం రాష్ట్ర వాటా సాధించేలా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.**

# తండ్రి బియ్యం వ్యాపారి.. కొడుకు డ్రగ్స్ వ్యాపారి..

- డ్రగ్స్ కు అలవాటు పడి అమ్మకం దారుగా మారిన లీలా కృష్ణ
- ఏ రకమైన డ్రగ్ కావాలన్నా సప్లై
- ఇటీవల పలు మార్లు పోలీసులకు దొరికిన నిందితుడు
- జైలుకు వెళ్లి వచ్చినా మారని వైనం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



డ్రగ్స్ కు అలవాటు పడి అమ్మకం దారుగా మారిన 24 సంవత్సరాల లీలా కృష్ణ అనే యువకుడు.. ఎవరికి ఏ రకమైన డ్రగ్ కావాలన్నా సప్లై చేసే స్థాయికి ఎదిగాడు. ఇప్పటికే మూడుసార్లు డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడిన లీలా కృష్ణ గురువారం నాలుగోసారి ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట కుశాల్ పార్క్ హై టెన్షన్ లైన్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ టీ ఎఫ్ సీఐ నాగరాజు బృందం ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించింది. బ్యాగులో డ్రగ్స్ ను పెట్టుకొని అమ్మకాలకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఎక్సైజ్ పోలీసులు లీలా కృష్ణను పట్టుకున్నారు. అతని బ్యాగులో తనిఖీలు నిర్వహించగా 17.07 ఓజీ కుష్ గంజాయి, 2.34. గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 2 ఎల్ ఎస్ డి బ్లాస్ట్,220 గ్రాముల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన డ్రగ్స్ గంజాయి విలువ రూ.1.40 లక్షలు గా ఉంటుందని సీఐ తెలిపారు.

ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులకు పట్టుబడిన లీలా కృష్ణ 2022,2023 లో ఎస్ఓటి పోలీసులకు పట్టుబడ్డాడు. 2024 మేలో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులకు పట్టుబడ్డాడు. మూడుసార్లు జైలుకు వెళ్లి వచ్చినా కూడా తన అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయలేదు. గోవాలోని అంజనా బీచ్ లో ఉన్నటువంటి డ్రగ్స్ వ్యాపారి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి హైదరాబాదుకు తీసుకువచ్చి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందరికీ అమ్ముతుంటాడు. తండ్రి బియ్యం వ్యాపారం చేస్తుంటే కొడుకు మాత్రం డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నాడు. లీలా కృష్ణను పట్టుకున్న టీంలో సీఐ నాగరాజు తో పాటు ఎస్సై జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ అన్వర్ లేక సింగ్, కానిస్టేబుల్ రాజేశ్వర్ వికాస్ శశి చంద్రశేఖర్ ఉన్నారు. అన్ని రకాల డ్రగ్స్ ను అమ్మకాలు జరిపే నొటోరియల్ క్రిమినల్ లీలా కృష్ణను పట్టుకున్న టీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి అభినందించారు.

# అరెస్టుకు భయపడేది లేదు..

**తెలంగాణ ముచ్చట్లు,అమరావతి:**



అరెస్టుకు భయపడేది లేదని, సీఎం చంద్రబాబు నాయుడు ఏం చేసుకున్నా తాను సిద్దం అని వైసీపీ పక్ష నేత విజయసాయి రెడ్డి తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అదానీతో సత్సంబంధాలు ఉన్నాయిని, తమపై ఎలాంటి ఒత్తిడులు లేవన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి అత్యంత పరిపాలన దక్షుడని, రాష్ట్రంలో తాము ఇచ్చినంత జనరంజకమైన సంక్షేమ పాలన ఎవరూ ఇవ్వలేరన్నారు. సీఎం చంద్రబాబుకు లంచమిచ్చి కేవీ రావు కాకినాడ పోర్టును తీసుకున్నారు అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ పోర్టు అంశంలో టీడీపీ నేతలు తన పేరును కూడా తీసుకురావడం, తనకు లుకౌట్ నోటీసులు జారీ చేయడం పట్ల విజయసాయి రెడ్డి మండిపడుతున్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు.

'1997లో ఏడీబీ (ఏలియన్ డెవలప్మెంట్ బ్యాంకు) నిధులతో రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ పోర్టును ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రంగం సంస్థగా పోర్టును అభివృద్ధి చేసి.. సీఎం చంద్రబాబు ప్రైవేట్ పరం చేశారు. 1997 నుంచి దర్యాప్తు చేస్తే బాగుంటుంది. కేవీ రావు ఓ బ్రోకర్. నాలుగున్నరేళ్లుగా ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారు. కేవీ రావును చిన్న వయసున్న విక్రాంత్ రెడ్డి బెదిరించారట. కేవీ రావు సంవత్సరంలో నాలుగు నెలలే ఇండియాలో ఉంటారు. సింగపూర్ నుంచి ప్రపంచవ్యాప్తంగా బ్రోకర్ పనులు చేసే వ్యక్తి ఆయన. కేవీ రావు ఓ కులవాది. కినాడ పోర్టును మలేషియా ప్రధానమంత్రి మహాతిర్ మహమ్మద్ తనయుడు కొంటున్నారని గతంలో చంద్రబాబు చెప్పారు. ఆ ముసుగులో కేవీ రావుకు పోర్టు కట్టబెట్టారు. ఈ విషయంపై చంద్రబాబు జేబు సంస్థ సీఐడీ ద్వారా కాకుండా సీబీఐ ద్వారా దర్యాప్తు జరపాలి' అని విజయసాయి రెడ్డి కోరారు.

'చంద్రబాబు అధికారంలోకి రాగానే ఇప్పుడు ఫిర్యాదు చేయడంలో ఆంతర్యం ఏమిటి. 2020లో కేవీ రావుకు నేను ఫోన్ చేశానని, కాకినాడ పోర్టుపై విక్రాంత్ రెడ్డితో మాట్లాడానని చెప్పడానికి ఆధారాలున్నాయా?. కేవీ రావు అనే వ్యక్తి చంద్రబాబుకు చెంచా, రాజకీయ తొత్తు. దొడ్డిదారిన కేవీ రావును చైర్మన్ గా ప్రవేశపెట్టారు. కాకినాడ పోర్టుకు సంబంధించిన ప్రతి నిర్ణయం కేవీ రావు తీసుకుంటున్నదే. మాపై చేస్తున్న ఆరోపణలు నిరాధారం. తక్కువ రేటుకి భూమి అందుబాటులో ఉంటేనే పరిశ్రమలు వస్తాయి. అందుకే కాకినాడ ఎస్సిజెడ్ ప్రారంభించాం. మేము అధికారంలో ఉన్నప్పుడు అదానీతో సత్సంబంధాలు ఉన్నాయి. మాపై ఎలాంటి ఒత్తిడులు లేవు, తీసుకురాలేదు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అదానీ తోడ్పడ్డారు. చంద్రబాబుకు లంచమిచ్చి కేవీ రావు కాకినాడ పోర్టును తీసుకున్నారు. ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన లాభాలను రాకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. ముందస్తు బెయిల్ కు కూడా దరఖాస్తు చేసుకోను. అరెస్టుకు భయపడేది లేదు. చంద్రబాబు ఏం చేసుకున్నా నేను సిద్ధం' అని విజయసాయి రెడ్డి చెప్పారు.




# ధాన్యం కొనుగోలులో ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు!

**తెలంగాణ ముచ్చట్లు,అమరావతి:**

ధాన్యం కొనుగోలులో ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదు అందాలని అధికారులకు సూచించారు. నేడు 26 జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ---

'ధాన్యం కొనుగోలులో ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు ఉంటాయి' అని అధికారులను హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఇప్పటివరకు 10.59 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు నగదుఇస్తున్నాము. నేటికి 1.51 లక్షల మంది రైతులకు రూ.2,331 కోట్లు చెల్లింపులు చేశాం. గతేడాది ఈ సమయానికి 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ జరిగింది. ఈ ఏడాది ఇప్పటికే 10.59 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుతో రికార్డు నెలకొల్పాం' అని సీఎం పేర్కొన్నారు.

# శ్రీవల్లి అంటే శ్రీవల్లి అనిపించుకుందిగా..!



మాస్ అండ్ కమర్షియల్ సినిమాల్లో కథానాయికలు కేవలం సాంగ్స్ కి మాత్రమే అనట్టుగా కొన్ని సినిమాలు వస్తాయి. కానీ కొంతమంది హీరోయిన్స్ కు మాత్రం అది ఎంత పెద్ద కమర్షియల్ సినిమా అయ్యుండి పాన్ ఇండియా రిలీజైనా కూడా అదిరిపోయే పాత్ర అవుతుంది. సరైన స్కోప్ వస్తే తమ టాలెంట్ చూపించే హీరోయిన్స్ సౌత్ ఇండస్ట్రీలో ముఖ్యంగా టాలీవుడ్ లో ఉన్నారు. అలాంటి వారిలో రష్మిక మందన్న ఒకరు. నేషనల్ క్రష్ గా పాన్ ఇండియా లెవెల్ లో అదరగొట్టేస్తున్న రష్మిక యానిమల్ తో పాన్ ఇండియా హిట్ కొట్టగా లేటెస్ట్ గా పుష్ప 2 తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది.పుష్ప 2 సినిమాలో శ్రీవల్లి పాత్ర కూడా హైలెట్ గా నిలిచింది.

పార్ట్ 1లో కేవలం కొన్ని సీన్స్ కే పరిమితం కాగా పార్ట్ 2 లో మాత్రం రష్మిక వేరే లెవెల్ అనిపించేలా చేసింది. సినిమా మొత్తం ఉన్నా కూడా అందులో 3 సీన్స్ లో అదరగొట్టేసింది. ముఖ్యంగా తన భర్త పుష్ప రాజ్ ని తక్కువ చేసి మాట్లాడే టైం లో అతనికి సపోర్ట్ గా సూపర్ డైలాగ్స్ తో అదరగొట్టేసింది రష్మిక. పాన్ ఇండియా సినిమాలో హీరోయిన్ కి అంతమంచి స్క్రీన్ స్పేస్ అది కూడా ఆమె ఒక్కతే మాట్లాడేలా సీన్ పడటం లక్కీ అని చెప్పొచ్చు. అల్లు అర్జున్ రష్మిక జోడీ సినిమాకు హైలెట్ కాగా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా వర్క్ అవుట్ అయ్యింది. రష్మిక కూడా వచ్చిన ఛాన్స్ ని పర్ఫెక్ట్ గా యుటిలైజ్ చేసుకుంది. పుష్ప 2 సినిమా చూసిన వారెవరైనా శ్రీవల్లి అంటే శ్రీవల్లి అనిపించేసింది.

యానిమల్ తో పాటు పుష్ప 2 తో నేషనల్ వైడ్ గా రష్మికకు మరింత క్రేజ్ రానుంది. తప్పకుండా రాబోతున్న సినిమాలతో రష్మిక కూడా తన స్టెల్లర్ పర్ఫార్మెన్స్ తో ఫ్యాన్స్ కు ఫీస్ట్ అందించేలా చేస్తుంది. ప్రస్తుతం రష్మిక గర్ల్ ఫ్రెండ్, కుబేర, సికిందర్ సినిమాల్లో నటిస్తుంది. పుష్ప 2 తోనే కాదు పుష 3 ర్యాంపేజ్ కూడా ఉంటుంది. సో మళ్లీ రష్మిక పుష్ప 3 లో కూడా ఉండే ఛాన్స్ ఉంది. రష్మిక ప్రాజెక్ట్ అంటే చాలు పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ ఏర్పడుతుంది.




# సంధ్య 70ఎంఎం విషాదం: అల్లు అర్జున్ పై కేసు నమోదు

అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్' గత రాత్రి ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీగా విడుదలైన సంగతి తెలిసిందే. తమ ఫేవరెట్ సినిమా వీక్షించేందుకు అభిమానులు చాలా ఉత్సాహంగా థియేటర్లకు తరలి వస్తున్నారు. హైదరాబాద్‌లోని RTC X రోడ్స్‌లోని సంధ్య 70ఎంఎం థియేటర్‌లో జరిగిన విషాదం అందరి హృదయాలను కలిచివేసింది. సంధ్య 70ఎంఎం థియేటర్ వద్ద అల్లు అర్జున్ సందర్శన సమయంలో సంభవించిన తొక్కిసలాట ఫలితంగా రేవతి అనే మహిళ మరణించగా, ఆమె 13 ఏళ్ల కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు.

మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సెక్షన్ 105, 118 (1) r/w 3(5) BNS చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. థియేటర్ లోపల ఒక వ్యక్తి మరణానికి.. ఒకరికి గాయం కావడానికి దారితీసిన అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వ్యక్తులందరిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోనున్నారు'' అని ఆయన ముగించారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సెక్షన్ 105, 118 (1) r/w 3(5) BNS చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. థియేటర్ లోపల ఒక వ్యక్తి మరణానికి.. ఒకరికి గాయం కావడానికి దారితీసిన అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వ్యక్తులందరిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోనున్నారు'' అని ఆయన ముగించారు.

## sports స్పోర్ట్స్




# తొలి వన్డే.. భారత మహిళా జట్టుపై ఆసీస్ విజయం

ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో భారత మహిళా జట్టు ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 100 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ కూడా తడబాటుకు గురైంది. టార్గెట్ 101 పరుగులే కావడంతో.. వికెట్లు పడినా ఆసీస్ ఇబ్బంది పడలేదు. కేవలం 16.2 ఓవర్లలోనే ఐదు వికెట్లను కోల్పోయి ఆసీస్ విజయం సాధించింది. ఓపెనర్లు జార్జియా వోల్ (46), ఫోబ్ లిట్‌చ్‌ఫీల్డ్ (35) రాణించారు. భారత బౌలర్లలో రేణుకా ఠాకూర్ 3, ప్రియా మిశ్రా 2 వికెట్లు తీశారు.

### కుప్పకూలిన భారత్

కెరీర్‌లో తొలి వన్డే ఆడుతోన్న ఆసీస్ బౌలర్ మెగాన్ స్కట్ (5/19) ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్ బ్యాటర్లను బెంబేలెత్తించింది. భారత బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ (23) టాప్ స్కోరర్. ఆమెతోపాటు హర్లీన్ డియోల్ (19), హర్మన్ ప్రీత్ కౌర్ (17), రిచా ఘోష్ (14) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఓపెనర్లు ప్రియా పునియా 3, స్మృతీ మంధాన 8, దీప్తి శర్మ 1, సైమా ఠాకూర్ 4, టిటాస్ సధు 2 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్కట్ 5 వికెట్లు.. కిమ్ గార్త్, గార్డెనర్, సదర్లాండ్, అలానా కింగ్ తలో వికెట్ తీశారు.



# సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ.. టీ20ల్లో బరోడా రికార్డు స్కోరు

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రికార్డుల పరంపర కొనసాగుతోంది. ఇటీవల ఉర్విల్ పటేల్ వరుసగా అత్యల్ప బంతుల్లో సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా బరోడా జట్టు టీ20ల్లోనే అత్యధిక పరుగులు చేసిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు అత్యధిక స్కోరు చేసిన జట్టుగా జింబాబ్వే పేరిట రికార్డు ఉండేది. ఈ ఏడాది అక్టోబర్‌లో గాంబియాపై 344/4 స్కోరు చేసింది. ఇప్పుడు ఆ రికార్డును అధిగమిస్తూ బరోడా ఐదు వికెట్ల నష్టానికి 349 పరుగులు చేసింది. ఇప్పటివరకు ప్రపంచ టీ20 క్రికెట్‌లో ఇదే టాప్ స్కోర్. సిక్కింపై భారీ విజయంసిక్కింతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 349/5 స్కోరు చేసింది. బరోడా బ్యాటర్లు భాను పానియా (134నాటౌట్: 51 బంతుల్లో 5 ఫోర్లు, 15 సిక్స్‌లు), శివాలిక్ శర్మ (55:17 బంతుల్లో), అభిమన్యు సింగ్ (53: 17 బంతుల్లో) సోలాంకి (50: 16 బంతుల్లో), షష్వాత్ రావత్ (43: 16 బంతుల్లో) చెలరేగిపోయారు. బంతిని ఎడాపెడా బాదేసి పరుగులు రాబట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో సిక్కిం ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో సిక్కిం ఏడు వికెట్ల నష్టానికి 86 పరుగులే చేయగలిగింది. దీంతో 263 పరుగుల భారీ తేడాతో బరోడా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత స్టార్ ఆటగాడు హార్దిక్ పాండ్య ఆడలేదు. కెప్టెన్‌గా కృనాల్ పాండ్య వ్యవహరించాడు.

టీ20 క్రికెట్‌లో పరుగులపరంగా అత్యధిక వ్యత్యాసంతో గెలిచిన నాలుగో జట్టుగా బరోడా నిలిచింది. జింబాబ్వే 290 పరుగుల తేడాతో గాంబియాను ఓడించగా.. నేపాల్ (మంగోలియాపై 273 పరుగులు), నైజీరియా (ఐవరీ కోస్ట్‌పై 264 పరుగులు) ఈ ఘనతను సాధించాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in